




Truth of News

# సూర్య వాస్తవం

RNI NO : APTEL/25/A0239

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్








సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 251 | మంగళవారం 03 మార్చి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# ఇరాన్ సుప్రీం ఖమేనీ హత్య



- అమెరికా - ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం
- మొత్తం 201 మంది మృతి
- 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని ప్రత్యక్షంగా పర్యవేక్షించిన ట్రంప్
- ఫోటోలు విడుదల చేసిన వైట్‌హౌస్
- మధ్యప్రాచ్యంలో భయం..భయం
- దాడుల్ని ఖండించిన రష్యా, చైనా

టెహ్రాన్ - సూర్య వాస్తవం

అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతమయ్యారు. ఆయన కూతురు, అల్లుడు, మనుమరాలు సహా ఇతర కుటుంబ సభ్యులు కూడా ఈ దాడిలో మృతి చెందారు. ఇరాన్ రక్షణశాఖ మంత్రి అజీజ్ నసీర్జాదే కూడా అసువులుబాసారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో ఇజ్రాయిల్-అమెరికా సంయుక్తంగా ఈ దాడుల్ని నిర్వహించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఆపరేషన్‌ను స్వయంగా పర్యవేక్షించారు. దీనికి సంబంధించిన ఫోటోలను వైట్ హౌస్ విడుదల చేసింది. ఖమేనీ మరణాన్ని తొలుత ట్రంప్ ధృవీకరించి, ప్రకటించారు. ఆ తర్వాత ఇరాన్ కూడా అధికారికంగా ప్రకటించింది. అయితే అమెరికా ఒత్తిడికి తలొగ్గబోమని ఇరాన్ సైన్యం స్పష్టం చేసింది. తమ నేత మరణించిన వార్త తెలియగానే ఇరాన్ సైన్యం పెద్దఎత్తున పశ్చిమాసియాలోని 27 అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లతో విరుచుకుపడింది. దుబాయ్ లోని అమెరికన్ సైనిక స్థావరం బాగా దెబ్బతింది. ఇజ్రాయిల్-అమెరికా చర్యను రష్యా, చైనా తీవ్రంగా ఖండించాయి. ఇరాన్‌లో పాలనను మార్చే బాధ్యత అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ది కాదని స్పష్టంచేశాయి.

ఖమేనీ మరణం సందర్భంగా ఇరాన్‌లో 40రోజుల సంతాపదినాలు పాటిస్తున్నట్టు ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఓవైపు చర్చలని ఇరాన్‌ను ఆహ్వానించి, మరోవైపు ఆ దేశంపై దాడులు చేయడాన్ని ప్రపంచదేశాలు సమర్థించలేకపోతున్నాయి. అనేక దేశాలు అమెరికా ఒత్తిళ్లకు భయపడి బహిరంగంగా వ్యాఖ్యలు చేసేందుకు సాహసించట్లేదు. భారత ప్రధాని నరేంద్రమోడీ కూడా ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతిపై ఇప్పటి వరకు స్పందించలేదు. దాడులకు రెండ్రోజుల ముందు మోడీ ఇజ్రాయిల్‌లో పర్యటించి వచ్చిన విషయం తెలిసిందే.

ఇజ్రాయిల్, అమెరికా కలిసి పక్కా సమాచారంతోనే ఖమేనీని హతమార్చాయి. శనివారం ఖమేనీ తన కార్యాలయంలో సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. ఇదే అదునుగా భావించి ఇజ్రాయిల్-అమెరికా దేశాలు సంయుక్తంగా దాడులకు తెగబడ్డాయి. ఖమేనీతో పాటు పలువులు ఈ దాడుల్లో మరణించారు. ఖమేనీ మృతికి సంబంధించి ఆ దేశ సీనియర్ అధికారులకు స్పష్టమైన సమాచారం అందడంతో శిథిలాల కింది నుంచి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలను ట్రంప్, నెతన్యాహు చూశారని వాషింగ్టన్ పోస్ట్ వెల్లడించింది. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో ఇరాన్ రక్షణ మంత్రి అజీజ్ నాసిర్జాదే, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్ మహ్మద్ పక్పూర్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ అబ్దోల్ రహీమ్ మౌసావి కూడా మరణించారని ప్రకటించారు. ఈ దాడుల్లో 201 మంది మతిచెందినట్టు వార్తలు వస్తున్నాయి. ఇజ్రాయిల్-అమెరికా దేశాలు ఇరాన్‌లోని పాఠశాలలు, కార్మిక నివాసభవనాలపై కూడా మిస్సైల్స్ ద్వారా దాడులు చేశాయి. దీనితో పలువురు చిన్నారులు, బాలికలు, మహిళలు, కార్మికులు మరణించారు.

**ఇరాన్ ప్రతిదాడులు**

ఆపరేషన్ తొలిరోజే ఖమేనీ మృతిచెందినప్పటికీ పశ్చిమాసియాలో భీకర యుద్ధం కొనసాగుతోంది. 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్' పేరుతో ఇరాన్ ప్రతిదాడులతో విరుచుకుపడుతోంది. గల్ఫ్ అంతటా యుద్ధ జ్వాలలు ఎగసిపడుతున్నాయి. సైరన్లతో ఆ ప్రాంతం మార్మోగుతోంది. ఇజ్రాయిల్-అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ బాంబులు,

- మిగతా 2లో..



## తెలంగాణ వాసులు అప్రమత్తంగా ఉండండి

## గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన వారిని క్షేమంగా వెనక్కి తీసుకురండి


2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# సంయమనం పాటించండి

- నెతన్యాహూను కోరిన మోడీ
- పశ్చిమాసియా నేతలతో టెలిఫోన్‌లో సంభాషణ

2లో



# ఇండో అమెరికా ట్రేడ్ డీల్ అత్యంత ప్రమాదకరం

- బీజేపీ విధానాలపై యుద్ధానికి సిద్ధంకండి
- కాంగ్రెస్ పీఏసీ సమావేశంలో అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు
- డీసీసీ అధ్యక్షులే మన సైన్యం
- పని చేయండి.. పదవులు అవే వస్తాయి...
- పార్టీ నిర్మాణంపై దృష్టి సారించండి
- వచ్చే రోజులన్నీ మనవేనంటూ దిశా నిర్దేశం
- వికారాబాద్‌లో ముగిసిన శిక్షణా కార్యక్రమాలు

2లో



# సంయమనం పాటించండి

## నెతన్యాహూను కోరిన మోడీ

## పశ్చిమాసియా నేతలతో టెలిఫోన్‌లో సంభాషణ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం


ప్రధాని నరేంద్ర మోడీ పశ్చిమాసియా నేతలతో టెలిఫోన్‌లో మాట్లాడారు. ఆ ప్రాంతంలో నెలకొన్న భద్రతా పరిస్థితిపై వారితో చర్చించారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూకు ఫోన్ చేసిన మోడీ, తాజా పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేశారు. పౌరుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సంయమనం పాటించాలని సూచించారు. శత్రుత్వాన్ని వీడాలని హితవు పలికారు. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ బిన్ జయేద్ అల్ నహ్యాన్‌తో కూడా మోడీ మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ఈ కష్టకాలంలో యూఏఈకి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. యూఏఈలో నివసిస్తున్న భారతీయుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. పశ్చిమాసియా నేతలతో మాట్లాడడానికి ముందు జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఉన్నత స్థాయి సమావేశానికి మోడీ అధ్యక్షత వహించారు. మధ్యప్రాచ్యంలో క్షీణిస్తున్న భౌగోళిక, రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

# తెలంగాణవాసులు అప్రమత్తంగా ఉండండి

**- మధ్యప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో సర్కార్ ముందస్తు చర్యలు**

**- న్యూఢిల్లీ తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు**

హైదరాబాద్- సూర్య వాస్తవం



మధ్యప్రాచ్యం (మిడిల్‌ఈస్ట్)లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అక్కడ నివసిస్తున్న తెలంగాణ పౌరులను రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24/7 కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. తెలంగాణ భవన్ సీనియర్ అధికారులు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత రాయబార కార్యాలయాలతో ఇప్పటికే నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ఆయా దేశాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ వాసులు, వారి కుటుంబ సభ్యుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను దష్టిలో ఉంచుకుని, అవసరమైన సమన్వయం, సహాయం అందించేందుకు కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం ఆయా దేశాల్లో ఉన్న రాష్ట్రానికి చెందిన ప్రజల ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైతే కంట్రోల్ రూంను సంప్రదించాలని అధికారులు కోరారు.

**కంట్రోల్ రూం ఫోన్ నెంబర్లు**

వందన బరువా, పీఎస్‌టూ రెసిడెంట్ కమిషనర్ అండ్ లైజన్ హెడ్ ఫోన్: 91 9871999044, సీహెచ్. చక్రవర్తి పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఫోన్: 91 9958322143, జావేద్ హుస్సేన్ లైజన్ ఆఫీసర్ ఫోన్: 9910014749, రక్షిత్ నాయక్ లైజన్ ఆఫీసర్, ఫోన్ :91 9643723157.

# గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన వారిని క్షేమంగా వెనక్కి తీసుకురండి

**- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం**

**- గల్ఫ్‌లో చిక్కుకున్న వారిని క్షేమంగా రప్పించేలా సీఎం చంద్రబాబు ఆదేశాలు**

**- ఆర్టీజీఎస్, ఏపీ ఎన్ఆర్‌టీఎస్ అధికారులతో సీఎం సమీక్ష**

**- విమాన సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు**

**- బాధితుల కోసం 24/7 ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లు ఏర్పాటు**

**- విమానాశ్రయాలు తెరుచుకునే వరకు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచన**

అమరావతి- సూర్య వాస్తవం



మధ్య ప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన ఏపీ వాసులను క్షేమంగా వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్, ఏపీ ఎన్ఆర్‌టీఎస్ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, కువైట్ వంటి దేశాల్లో చిక్కుకున్న ప్రయాణికులను స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ శాఖతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సీఎం సూచించారు. యుద్ధం, విమాన సర్వీసుల రద్దు కారణంగా ఇబ్బందులు పడుతున్న వారిని వెంటనే గుర్తించి సహాయం అందించాలన్నారు. ఆయా దేశాల్లోని భారతీయ ఎంబసీలతో నిరంతరం టచ్‌లో ఉంటూ సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆర్టీజీఎస్, ఏపీ ఎన్ఆర్‌టీఎస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గల్ఫ్ దేశాల్లోని తెలుగు వారు ఎవరూ ఆందోళన చెందవద్దని, విమానాశ్రయాలు తిరిగి తెరుచుకుని సర్వీసులు ప్రారంభమయ్యే వరకు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని చంద్రబాబు సూచించారు. ఏపీ ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏపీ ఎన్ఆర్‌టీఎస్ కోఆర్డినేటర్ల ద్వారా అవసరమైన వారికి తాత్కాలిక వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని రాష్ట్ర ఎన్నారై శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బాధితుల కోసం ప్రభుత్వం 24 గంటల పాటు పనిచేసే ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటు చేసింది. హెల్ప్‌లైన్ నెంబర్లు: ఫోన్: 0863-2340678, వాట్సాప్:

# ఇరాన్ సుప్రీం ఖమేనీ హత్య

(మొదటిపేజీ తరువాయి)

ఆత్మాహుతి దాడులతో యుద్ధాన్ని తీవ్రం చేసింది. దీనితో ఆయా దేశాల్లో భారీగా ఆస్తినష్టం సంభవించింది. ప్రాథమిక సమాచారం మేరకు 9 మంది ఇజ్రాయిల్ పౌరులతో పాటు ముగ్గురు యూఎస్ సైనికులు కూడా మృతి చెందినట్టు తెలుస్తోంది.

అనేకమంది క్షతగాత్రులు అయ్యారు. ఖమేనీ మృతికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ మంత్రివర్గం ప్రకటించింది. చరిత్రలో ఎన్నడూ చూడని భయంకరమైన దాడులు ఏ క్షణాల్లోనైనా జరగొచ్చని హెచ్చరించింది. ఇజ్రాయిల్, యూఎస్ స్థావరాలే లక్ష్యంగా భారీ ఆపరేషన్ చేపట్టేందుకు ఐఆర్‌జీసీ సిద్ధమైనట్టు అక్కడి మీడియా వెల్లడించింది. మరోవైపు అమెరికా- ఇజ్రాయిల్ దాడుల్లో ఖమేనీ కీలక సలహా దారులు అలీ షంఖానీతో పాటు ఐఆర్‌జీసీ చీఫ్ మహమ్మద్ పాక్‌పౌర్ ప్రాణాలు కోల్పోయారని తాజాగా ఇరాన్ ధ్రువీకరించింది. ఈ క్రమంలో ఐఆర్‌జీసీ తన కొత్త కమాండర్-ఇన్-చీఫ్‌గా మాజీ రక్షణ మంత్రి అహ్మద్ వాహిదీకి బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది.

**ప్రత్యక్ష వ్యూహకర్త ట్రంప్**

ఇరాన్‌పై అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్వయంగా పర్యవేక్షించారు. సాధారణంగా హైవేల్యూ టార్గెట్లపై జరిగే దాడులే అమెరికా అధ్యక్షుడి కనుసన్నల్లో జరుగుతాయి. తాజాగా ట్రంప్ పర్యవేక్షణకు సంబంధించిన చిత్రాలను శ్వేతసౌధం విడుదల చేసింది. ఫ్లొరిడాలోని పామ్‌బీచ్‌లోని ట్రంప్ స్వగృహం మార్ ఎ లాగో రిసార్ట్‌లో ఆయన ఈ టార్గెట్లపై రివ్యూ చేస్తున్న ఫోటోలను వైట్‌హౌజ్ విడుదల చేసింది. ఆ సమావేశంలో ట్రంప్‌తో పాటు విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఆర్మీ కీలక జనరల్స్ సుసీ విల్లీస్, డాన్ కెయిన్ తదితరులు ఉన్నారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా వార్ రూమ్‌లో పరిస్థితిని పర్యవేక్షిస్తున్న చిత్రాన్ని శ్వేతసౌధం పోస్టు చేసింది. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు సౌదీ, ఇజ్రాయిల్ సహా ఇతర గల్ఫ్ నేతలతో కూడా టచ్‌లో ఉన్నట్టు వెల్లడించింది. అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరి' తోపాటే ఇజ్రాయిల్ కూడా 'ఆపరేషన్ రోర్ ఆఫ్ ది లయన్' చేపట్టిన విషయం తెలిసిందే.

**పతనం వైపు అమెరికా : ఖమేనీ చివరి ప్రసంగం**

అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ చివరి సారిగా ప్రసంగించిన ఓ వీడియో వైరల్‌గా మారింది. ఫిబ్రవరి 17న ఆయన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ అమెరికాపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను ప్రస్తావిస్తూ.. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను ఏమీ చేయలేరని అన్నారు. అమెరికా పతనం వైపు వెళ్తోందన్నారు. "అమెరికా ఆర్థిక వ్యవస్థ క్షీణిస్తోంది. విధానాలు, వివిధ సమస్యలతో ఆ దేశం సతమతమవుతోంది. 50శాతానికి పైగా అమెరికా పౌరులు ప్రస్తుత అధ్యక్షుడిని ఆమోదించడం లేదు. ఇరాన్‌ను రూపు మాపాలని వాళ్లు అనుకుంటున్నారు. వారి ప్రయత్నాలను అడ్డుకుం టూనే ఉన్నాం. 47ఏండ్లుగా ఇస్లామిక్ రిపబ్లిక్‌ను ఏమీ చేయలేకపోయామని స్వయంగా అమెరికా అధ్యక్షుడే వారి ప్రజలకు చెబుతున్నారు. అది నిజమే. ఇప్పుడు కూడా వాళ్లు ఏమీ చేయలేరు" అని ఖమేనీ ఆ సమావేశంలో పేర్కొన్నారు.

**దాడుల్ని ముమ్మరం చేసిన ఇజ్రాయిల్-అమెరికా**

అమెరికా-ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్‌పై సంయుక్తదాడుల్ని ముమ్మరం చేశాయి. గతానికి భిన్నంగా ఈసారి పగటి వెలుగులోనే అమెరికా దాడులకు దిగింది.

నివాస భవనాలపై క్షిపణులతో దాడులు చేస్తోంది. ఇరాన్‌లో కూడా భారీగా ఆస్తి, ప్రాణనష్టం జరిగినట్టు తెలుస్తోంది.

# ఇండో అమెరికా ట్రేడ్ డీల్ అత్యంత ప్రమాదకరం

**- బీజేపీ విధానాలపై యుద్ధానికి సిద్ధంకండి**

**- కాంగ్రెస్ పీఏసీ సమావేశంలో అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు**

**- డీసీసీ అధ్యక్షులే మన సైన్యం**

**- పని చేయండి.. పదవులు అవే వస్తాయి...**

**- పార్టీ నిర్మాణంపై దృష్టి సారించండి**

**- వచ్చే రోజులన్నీ మనవేనంటూ దిశా నిర్దేశం**

**- వికారాబాద్‌లో ముగిసిన శిక్షణా కార్యక్రమాలు**

హైదరాబాద్ - సూర్య వాస్తవం

ఇండో అమెరికా ట్రేడ్ డీల్ మనకు అత్యంత ప్రమాదకరమని పార్లమెంటులో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోడీ చర్యలతో మనదేశంలో సైతం యుద్ధ వాతావరణం నెలకొందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఆయన పూర్తిగా దాసోహమయ్యారని ఎద్దేవా చేశారు. అందుకే మోడీ.. అమెరికాకు వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని పేర్కొన్నారు. ఇరాన్‌లో తలెత్తిన పరిస్థితులు ఇండియాలో రాకుండా చూసుకోవాలని ఆయన దేశ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై యుద్ధానికి సిద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో తొమ్మిది రోజులపాటు కొనసాగిన తెలంగాణ, ఏపీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల (డీసీసీలు) శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతోపాటు కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశాన్ని కూడా నిర్వహించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలపై డీసీసీలకు రాహుల్‌గాంధీ దిశా నిర్దేశం చేశారు. అంతర్జాతీయ, జాతీయ రాజకీయాల్లో నెలకొన్న పరిణామాల గురించి ఆయన వారితో చర్చించారు. కాంగ్రెస్ పార్టీ అహింసా వాదాన్ని నమ్ముతూ రాజకీయాలు చేస్తుంటే.. బీజేపీ హింసావాదంతో ముందుకు సాగుతోందని విమర్శించారు. తాము గాంధేయ వాదాన్ని అనుసరిస్తే.. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు గాడ్సే బాటలో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని దుయ్యబట్టారు. ప్రధాని మోడీ దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన దుర్మార్గాలన్నీ ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని చెప్పారు. వాటన్నింటినీ ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. డీసీసీ అధ్యక్షులే తమ పార్టీకి అసలైన సైన్యమని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అందువల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో వారి పాత్రను మరింత పెంచుతామని భరోసానిచ్చారు. ఏఐసీసీ దేశవ్యాప్త పిలుపులను నూటికి నూరుశాతం జయప్రదం చేయాలని సూచించారు. తెలంగాణ, ఏపీల్లోని సామాజికాంశాలపై అధ్యయనం చేయాలని అన్నారు. తెలంగాణలో పార్టీ, ప్రభుత్వం జోడెడ్లలాగా పని చేస్తున్నాయని కితాబిచ్చారు. సీనియర్ నేతలు, కార్యకర్తలు, నాయకులను కలుపుకుని ముందుకు పోవాలని రాహుల్ ఈ సందర్భంగా సూచించారు. అహాన్ని పక్కనపెట్టి పని చేయాలని హితవు పలికారు. 'ఇగో'ల కంటే పార్టీ ముఖ్యమనే విషయాన్ని గుర్తెరగాలని అన్నారు. ఒక్కో డీసీసీ అధ్యక్షుడు మరో పదిమంది క్రియాశీలక నాయకుల్ని తయారు చేయాలని దిశా నిర్దేశం చేశారు. పని చేస్తున్న వారిని గుర్తించి, ప్రోత్సహించాలని కోరారు.

**మార్షల్ ఆర్ట్స్‌తో క్లాస్...**

సమావేశంలో రాహుల్ గాంధీ మార్షల్ ఆర్ట్స్ చేస్తూ వినూత్నంగా సందేశమిచ్చారు. అందులోని మెళకువలను డీసీసీ అధ్యక్షులకు వివరించారు. మార్షల్ ఆర్ట్స్‌ను వ్యక్తిగత జీవితానికి అన్వయించుకోవాలని సూచించారు. జాతిపిత మహాత్మా గాంధీకి ఒంటిపై ఒక బట్ట తప్ప ఏమీ ఉండదని గుర్తు చేశారు. అంతటి నిరాడంబరుణ్ని బ్రిటీష్ వారు సైతం ఏమీ చేయలేకపోయారని పేర్కొన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రజలతో మమేకమై పని చేయాలని పిలుపునిచ్చారు. కష్టించి పని చేయండి.. రానున్న రోజులన్నీ మనవేనంటూ భరోసానిచ్చారు.

**కాంగ్రెస్ శివుడు.. బీజేపీ విష్ణువు...**

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీని శివుడితో పోల్చారు. తనలో సగభాగాన్ని భార్యకు ఇచ్చిన శివుడు, నిరాడంబరంగా ఉంటారని గుర్తు చేశారు. అదే రకంగా కాంగ్రెస్ పద్ధతి సాధారణంగా ఉంటుందని తెలిపారు. అందుకు భిన్నంగా బీజేపీ విష్ణువులాగా నగలు నట్రాతో ఆడంబరంగా, అత్యంత విలాసంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. వాటిని కాపాడుకోవటానికే ఆ పార్టీ ప్రజల మీద ఆయుధా(అధికారం)న్ని ప్రయోగిస్తోందని ఎద్దేవా చేశారు.

**దేశం కోసం ప్రధాని అవుతా..**

కాగా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... రాహుల్ గాంధీ దేశానికి ప్రధాని కావాలంటూ విజ్ఞప్తి చేశారు. ఆయన తాత నెహ్రూ, నానమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్ గాంధీ ప్రధాని పదవిని చేపట్టి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని గుర్తు చేశారు. అదే తరహాలో ఇప్పుడు దేశాన్ని రక్షించేందుకు, విపత్కర పరిస్థితులనుంచి బయటపడేసేందుకు రాహుల్ గాంధీ కూడా పీఎం పదవిని చేపట్టాలని కోరారు. తాను ఓ ముఖ్యమంత్రిగా ఈ విజ్ఞప్తి చేయటం లేదని.. సాధారణ కాంగ్రెస్ కార్యకర్తగా అభ్యర్థిస్తున్నానని తెలిపారు. స్పందించిన రాహుల్ గాంధీ మోడీపై యుద్ధం చేసేందుకు ప్రధాని పదవిని చేపడతానని వ్యాఖ్యానించారు.

# ఏపీజేఏసీ అన్నమయ్య జిల్లా కార్యవర్గం ఎన్నిక

**రాయచోటి-సూర్యవాస్తవం:** ఏపీ జేఏసీ వైఎస్ఆర్ కడప జిల్లా ఛైర్మన్ కామ్రేడ్ బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏపీ జెఎసి అన్నమయ్య జిల్లా నూతన కార్యవర్గాన్ని రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో జేఏసీలోని సభ్యులుగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాలు సమావేశం ఏర్పాటు చేసుకుని 35 మందితో కూడిన కార్యవర్గా న్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఛైర్మన్ యం వేణుగోపాల్ రెడ్డి ఏపీ ఎన్జీజీఓ'స్ అసోసియేషన్సెక్రటరీ జనరల్ ఏ శివారెడ్డి ఎస్ టి యు,కోశాధికారి జి. నాగేశ్వర్, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ కో ఛైర్మన్ జె.శ్రీనివాసన్ ఏపీ ఎన్జీజీఓస్ అసోసియేషన్, పి.సుబ్రమణ్యం రాజు ఎన్‌యంయు, ఏ.హరిబాబు ఏపీ టిఎఫ్ 257, వైస్ ఛైర్మన్‌లుగా వి ఎండి ఇలియాస్ ఏపీటీఎఫ్ 1938 ,పి మహదేవ ఏపీ ఎల్ ఎస్ ఏ అసోసియేషన్ ఎన్ రామాంజులు ఎన్ టి ఏ,జి శ్రీనివాసులు పెన్షనర్స్ అసోసియేషన్,బి రవిశంకర్ మెడికల్ అండ్ హెల్త్ ,ఎస్ జాబీర్ యుటిఎఫ్, ఎం ప్రతిభకుమారి ఉమెన్స్ వింగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వై రాజశేఖర్ రెడ్డి మున్సిపల్ డిపార్ట్మెంట్, జాయింట్ సెక్రటరీ లుగా డి వెంకటేశ్వర్లు గ్రామ వార్డు సచివాలయం, జి వెంకటేశ్వర్లు పంచాయతీ రాజ్ డిపార్ట్మెంట్, ఎం మహమ్మద్ భాష మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్, వై రవీంద్రారెడ్డి ఎస్ టి యు, మీ మధుసూదన్ ఎస్ టి యు, లక్ష్మీనారాయణ క్లాస్ 4 ఎంప్లాయిస్ అసోసియేషన్, జి పవనకుమారి ఐసిడిఎస్ డిపార్ట్మెంట్, వివిధ ప్రభుత్వ శాఖలు నుంచి 14 మందిని ఈసీ మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



# సంపాదకీయం

## ముగిసిన ఖమేనీ శకం



ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన సంయుక్త వైమానిక దాడుల్లో మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా ధృవీకరించింది. టెహ్రాన్‌లోని ఆయన నివాసం లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో ఖమేనీతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, కీలకమైన సైనిక నాయకులు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ వార్త ధృవీకరణ కావడంతో ఇరాన్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 40 రోజుల సంతాప దినాలను ప్రకటించింది. దశాబ్దాల కాలం పాటు ఇరాన్ రాజకీయ, సైనిక వ్యవస్థను శాసించిన ఒక శకం దీనితో ముగిసింది.ఖమేనీ మరణంతో అమెరికా, ఇజ్రాయెల్ పంతం నెగ్గినట్లయింది. అయితే యుద్ధం ముగిసిపోతుందా అంటే చెప్పడం కష్టం. ఖమేనీ చనిపోయినా ఇరాన్ లొంగిపోయే అవకాశాలు కనిపించడం లేదు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం, నాయకత్వ బాధ్యతలను తాత్కాలికంగా ముగ్గురు సభ్యుల కౌన్సిల్ స్వీకరించింది. కానీ క్షేత్రస్థాయిలో పట్టున్న ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రతీకారేచ్ఛతో ఉంది. ఇప్పటికే అమెరికా స్థావరాలపై , ప్రాంతీయ మిత్రదేశాల లక్ష్యాలపై ఇరాన్ క్షిపణి దాడులను ముమ్మరం చేసింది. నాయకత్వ శూన్యతను పూడ్చుకునే క్రమంలో ఇరాన్ మరింత దూకుడుగా వ్యవహరించే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియా విశ్లేషిస్తోంది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఆపరేషన్‌ను ధ్యప్రాచ్యంలో శాంతి స్థాపనకు లభించిన గొప్ప అవకాశంగా అభివర్ణించారు. ఇరాన్ పాలనలో మార్పు రావాలని అమెరికా ఆశిస్తున్నారు. అంటే లొంగిపోవాలని ఆయన కోరుకుంటున్నారు. కానీ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తమ ఆపరేషన్ ఇంకా ముగియలేదని, ఇరాన్ అణు , క్షిపణి వ్యవస్థలే తదుపరి లక్ష్యాలని స్పష్టం చేశారు. ఈ పరిణామం వల్ల మధ్యప్రాచ్యం ఒక్కసారిగా అనిశ్చితిలోకి వెళ్లిపోయింది. దుబాయ్, బహ్రెయిన్ వంటి వాణిజ్య కేంద్రాలపై దాడులు పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.ప్రస్తుతం ఇరాన్ తన తదుపరి వారసుడిని ఎన్నుకునే ప్రక్రియలో ఉంది. ఖమేనీ కుమారుడు వారసుడు అయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే అమెరికా ప్రోద్భలంతో అధికార మార్పిడి సజావుగా సాగదని.. అంతర్గత తిరుగుబాట్లకు దారితీసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఇరాన్ లోపల అంతర్యుద్ధం వంటి పరిస్థితులు తలెత్తితే, అది ప్రపంచ చమురు సరఫరాను , ఆర్థిక వ్యవస్థను కోలుకోలేని విధంగా దెబ్బతీస్తుంది. యుద్ధం ఆగిపోవడానికి బదులు, ఇది ఒక సుదీర్ఘమైన ప్రాంతీయ సంఘర్షణకు ఆరంభంగా మారుతుందేమోనన్న భయం గల్ఫ్ దేశాల్లో నెలకొంది. అందుకే ఖమేనీ అంతంతో అన్నీ అయిపోలేదు.. అసలు సమస్యలు ముందున్నాయని ప్రపంచదేశాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై క్షిపణులతో విజృంభించాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని హతమర్చాయి. ఖమేనీ కూతురు, అల్లుడి కూడా ఈ దాడుల్లో మరణించినట్లు ఇరానీ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఖమేనీ మరణంతో పాటు 40 రోజుల పాటు సంతాప దినాలు ప్రకటిస్తున్నట్లు ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. శనివారం మధ్యాహ్నం నుంచి మొదలైన యుద్ధం నిర్విరామంగా కొనసాగుతోంది. ఖమేనీని హతమార్చుతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత కొంతకాలంగా ప్రకటిస్తూ వస్తోన్నారు. చివరికి ఇజ్రాయెల్‌తో కలిసి తన శపథాన్ని ట్రంప్ నెరవేర్చుకున్నారు. అయితే ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలతో ప్రపంచ మార్కెట్లు కుదేలవుతున్నాయి. బంగారం, వెండి ధరలు మండిపోతున్నాయి.ఖమేనీ మరణంతో యుద్ధం మరింత ముదిరే అవకాశముంది. గల్ఫ్ దేశాలైన దుబాయ్, ఖాతార్, అబుదాబిపై ఇరాన్ ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. గల్ఫ్ దేశాలపై కూడా యుద్ధ ప్రభావం పడటంతో ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో బంగారం ధరలు సోమవారం రికార్డ్ దిశగా దూసుకెళ్లే అవకాశముందని మార్కెట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైన కొద్ది సేపటికే ముందుగా క్రిప్టో కరెన్సీలపై దీని ప్రభావం పడింది. బిట్ కాయిన్ 5 శాతం పడిపోయి 64 వేల డాలర్ల మార్క్ కంటే దిగువకు పడిపోయింది. యుద్ధ ప్రభావంతో సోమవారం నుంచి మార్కెట్లు అస్థిరంగా ఉండవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక పసిడి ధరలు సరికొత్త రికార్డులు సృష్టించచొచ్చని చెబుతున్నారు.ఇక ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం, అమెరికా కూడా యుద్ధంతో పాల్గొనడంతో ముడి చమురు ధరలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. యుద్ధ ప్రభావం వల్ల ఇరాన్‌లో చమురు సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ క్రమంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 80 డాలర్లు దాటి వెళ్లవచ్చని అంటున్నారు. ఇజ్రాయెల్- అమెరికా దాడులతో ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్త వాతావరణ నెలకొంది. భారత్ తన క్రూడ్ ఆయిల్ దిగుమతుల్లో సగానికిపైగా పైగా ఈ జలసంధి నుంచే తీసుకువస్తోంది. దీంతో ఈ అంశం తీవ్ర ఆందోళనలు కలిగిస్తోంది. ఇక్కడ రవాణాకు ఏ మాత్రం ఆటంకం ఏర్పడినా ఇంధన, సరకు రవాణా వ్యయాలు భారీగా పెరుగుతాయి. భారత ఆర్థిక వ్యవస్థపై ఇది పెను భారాన్ని మోపనుంది.ముడి చమురు ధరలు పెరిగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. దీంతో దేశవ్యాప్తంగా సరకు రవాణా ఖర్చులు పెరిగేందుకు అవకాశం ఉంది. ఎర్ర సముద్రంలో భద్రత లేకపోతే నౌకలు ఆఫ్రికా మీదుగా ప్రయాణించాల్సి వస్తుంది. దీంతో సరకు రవాణా సమయం 15-20 రోజులు అవుతుంది. దీంతో ఖర్చు 50 శాతం వరకు పెరుగుతంది. ఇవన్నీ అంతిమంగా వినియోగదారుడిపైనే పడతాయి. ఇదే కాకుండా ఇరాన్, ఇజ్రాయెల్, కువైట్ తదితర దేశాల గగనతలాలు పాక్షికంగా మూసివేశారు. దీంతో ఎయిర్ ఇండియా, ఇండిగో విమాన కంపెనీలు అమెరికా, ఐరోపా రూట్లను మళ్లించాయి. దీంతో ఇంధ ఖర్చుల ప్రభావం కనిపిస్తుంది. దీంతో విమాన టికెట్ల ధరలు భారీగా పెరగవచ్చు. ప్రస్తుతం బ్యారెల్‌కు బ్రెంట్ క్రూడ్ 70 డాలర్ల కంటే ఎక్కువగా ఉంది. ఈ వారంలో ధరలు మరింత పెరిగితే పెట్రోల్, డీజిల్ ధరలపై ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. భారతదేశం ముడి చమురును 80 శాతం వరకు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది.

# డిసిహెచ్ఎస్ నియామకాలలో అక్రమాలు....!


- 100 పాయింట్ల రోస్టర్ సైకిల్ పూర్తి కాకుండానే తిరిగి మొదటి రోస్టర్ నుండి నియామకాలు
- 2023 డిసీహెచ్ఎస్ నోటిఫికేషన్‌లో భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడిన ఎ.వో...?
- దీనికి భిన్నంగా మెడికల్ కాలేజీ నోటిఫికేషన్ రోస్టర్ పాయింట్లు అనుసరణ
- ఎవరిది తప్పు ఎవరిది ఒప్పు అనేది ప్రశ్నార్థకం..!
- తప్పులు సరిదిద్దకుండా మరో నోటిఫికేషన్ విడుదల
- ఆధారాలతో జిల్లా కలెక్టర్‌కు అందజేసిన ఏఐఎస్బి రాష్ట్ర నేతలు



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :**

అనంతపురం జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి పరిధిలో 2023లో విడుదల చేసిన నోటిఫికేషన్‌లో రోస్టర్ పాయింట్లు లో తేడాలు ఉన్నట్లు వెలుగులోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నియామకాల నిబంధనల ప్రకారం 100 పాయింట్ల రోస్టర్ సైకిల్ పూర్తి కాకుండా తిరిగి మొదటి నుండి రోస్టర్ పాయింట్లు ప్రారంభం చేయకూడదు . అలాంటిది 2023 లో డి సి హెచ్ ఎస్ పరిధిలోని విడుదల చేసిన నోటిఫికేషన్ లో 100 పాయింట్ల రోస్టర్ సైకిల్ పూర్తి కాకుండా తిరిగి మొదటి రోస్టర్ నుండి నియామకాలు చేపట్టారు . తమకు అనుకూలంగా ఉన్న వారికి ఉద్యోగాలు రావడం కోసం కాసులకు ఉద్యోగాలు అమ్ముకున్నారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇదే సమయంలో 2023 జిల్లా మెడికల్ కాలేజీలో లో విడుదల చేసిన నోటిఫికేషన్ లో రోస్టర్ పాయింట్లు గతంలో ఎక్కడ ముగించారో ( ఎక్సింగ్) అక్కడినుండి ప్రారంభం చేశారు.ఈ రెండు నోటిఫికేషన్ లు జిల్లా కలెక్టర్ వారి అనుమతి ఇచ్చారు . ఈ రెండు నోటిఫికేషన్ లు లో జీ.ఓ 77 ప్రకారం నియామకాలు జరిగాయన్నారు. ఒకరు 100 రోస్టర్ పాయింట్లు సైకిల్ పూర్తి కాకుండా మొదటినుంచి కొనసాగింపు. మరొకరు ఎక్సింగ్ రోస్టర్ పాయింట్లు నుండి కొనసాగింపు... !మరి ఎవరి నోటిఫికేషన్ తప్పు ఎవరిది ఒప్పు అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఆశ్చర్యం కలిగించే విషయం ఏంటంటే రెండు నోటిఫికేషన్ లకు జిల్లా నియామకాలు కమిటీ సభ్యులు డి సి హెచ్ ఎస్ మరియు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఇద్దరు సంతకాలు చేశారు. ఉద్దేశ పూర్వకంగానే అధికారులు ఇలా చేశారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .

జిల్లా కలెక్టర్ వీటిని పరిశీలించి వెంటనే తక్షణ చర్యలు తీసుకోవాలని ఏఐఎస్బి రాష్ట్ర కార్యదర్శి పాపిరెడ్డి పల్లి పృథ్వీ తదితర బృందం జిల్లా కలెక్టర్ కు నివేదిక అందజేశారు.



TO

THE COLLECTOR & MAGISTRATE , ANANATAPURAMU,

THE SUPERINTENDENT OF POLICE, ANANTAPURAMU,

SUB:20-02-2025 & 21-02-2025 తేదీలలో నిర్వహించబడుతున్న GMC NOTIFICATION కౌన్సెలింగ్ ప్రక్రియను తక్షణం నిలిపివేయుటకు వినతి.

ప్రస్తుత GMC MEDICAL COLLEGE నోటిఫికేషన్ నిలిపివేయడానికి కోరడం వెనుక కారణం :

పాత బెటి నోర్సింగ్ ఉద్యోగుల కు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి ఉంటే ప్రస్తుతం ఎటువంటి సమస్య లేదు. పాత ఉద్యోగులకు ROR అనుసరించి నియామకాలు లేకుంటే? , ఆ సమస్య ప్రస్తుత నోటిఫికేషన్ విడుదల లో రోస్టర్ పాయింట్లు లో తేడాలు వస్తాయి. ఒక రోస్టర్ సైకిల్ పూర్తి కావాలంటే ఒకే కేడర్ లో 100 నియామకాలు పూర్తి అవ్వాలి. పాత ఉద్యోగులకు ఆప్కాస్ మెర్జింగ్ లో ROR FOLLOW అయ్యారా లేదా అనేది విచారణ తర్వాత తెలుస్తుంది గా ? అందుకే ప్రస్తుత నోటిఫికేషన్ ఫైనల్ సెలెక్ట్ లిస్ట్ రద్దు చేయాలి. విచారణ పూర్తి అయ్యాక ముందుకు వెళ్ళాలి.

మరొక కారణం :


- ✓ 2023(అనగా ప్రస్తుత నోటిఫికేషన్ )లో మెడికల్ కాలేజి నోటిఫికేషన్ విడుదల చేసింది. మరియు DCHS లో కూడా నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండు నోటిఫికేషన్ లో G.O 77 అనుసరించాము అని అన్నారు.
- ✓ రెండు నోటిఫికేషన్ లు జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకున్నారు. రెండు నోటిఫికేషన్ లో కమిటీ అధికారులు ప్రిన్సిపాల్ DCHS, DMHO, సంతకాలు చేశారు.
- ✓ మరి DCHS నోటిఫికేషన్ లో రోస్టర్ పాయింట్లు మొదటి నంబర్ నుంచి ప్రారంభం చేశారు .
- ✓ మెడికల్ కాలేజి లో సెలక్ట్ లిస్ట్ లో Existing Roster point నుండి ప్రారంభించారు.

ఎవరిది తప్పు ? ఎవరిది ఒప్పు ?

పైన తెలిపిన ఈ రెండు కారణాలు చేత ప్రస్తుత నోటిఫికేషన్ పూర్తిగా రద్దు లేదా తాత్కాలికంగా ఫైనల్ లిస్ట్ నిలిపివేయాలి విచారణ పూర్తి అయ్యాక ముందుకు వెళ్ళాలి..

# ప్రభుత్వ ఆసుపత్రిలో అక్రమ వసూళ్ల కలకలం..!

- వివాదాస్పదంగా మారిన నర్సింగ్ సూపరింటెండెంట్ తీరు...!
- రిటైర్మెంట్ ఫంక్షన్ పేరుతో రూ.లక్షలలో వసూలు....?
- పండుగల పేరు చెప్పి సంబరాలు అంటూ యూనియన్ అండతో బలవంతపు వసూళ్లు
- డ్యూటీ రోస్టర్ వేయడానికి కూడా డబ్బే కీలకం
- యూనియన్ నాయకుడిని అంటూ దందాకు దిగిన మరో నర్సింగ్ ఉద్యోగి...!
- డబ్బు ఇవ్వకుంటే కక్ష్య సాధింపులు చర్యలు అంట...?
- అధికారులు చర్యలు తీసుకుంటారా...?




**కర్నూలు క్రైమ్ - సూర్య వాస్తవం :** కర్నూల్ ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నర్సింగ్ వ్యవస్థ రోజురోజుకు వివాదాస్పదంగా మారింది. దీనికి అక్కడ నర్సింగ్ సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తున్న అధికారిణి మరియు యూనియన్ నాయకుడును అని మరో నర్సింగ్ ఉద్యోగి కారణం అంటూ నర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వారిలో కాంట్రాక్ట్ స్టాఫ్ అధిక సంఖ్యలో విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో సుమారు హెడ్నర్సిస్ 50 మంది రెగ్యులర్ స్టాఫ్ నర్స్ 90 మంది కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ 500 మంది దాకా నిధులు నిర్వహిస్తున్నారు పేషెంట్ అడ్మిషన్ నుండి డిశ్చార్జ్ అయ్యేవరకు వీరి వ్యవస్థలో కాంటాక్ట్ కీలకంగా మారారు .వీరి సంఖ్యాబలం యూనియన్ వీరి నుండి ఏదో రూపంలో డబ్బులు కలెక్ట్ చేయాలి అని ఆలోచన ఏర్పడింది. సంఖ్య బలం ఆసరా చేసుకొని రిటైర్మెంట్ ఫంక్షన్ కి , పండుగలకు అని పేరుతో ఏకంగా లక్షల్లో బలవంతపు వసూలు చేసి వాళ్ళ సంబరాల్ని సంబరాన్ని చేసుకుంటున్నారు.వీటికి వాసులకు ఇద్దరు హెడ్ నర్సులు మరియు కొందరు యూనియన్ నేతలు కలసి వాసులకు పాల్పడుతున్నారు. దీనికి తోడు నర్సింగ్ సుపెరిడేంట్ అధికారిణి కొందరు హెడ్ నర్సులు కాంట్రాక్ట్ స్టాఫ్ పట్ల తీవ్ర అసమా నతలు చూపుతూ పని పట్ల వ్యత్యాసం, బలవంతపు వసూలు కు పాల్పడుతున్నారు.కాంట్రాక్ట్ స్టాఫ్ ఉద్యోగులు భయంతో ఉద్యోగులు తప్పని పరిస్థితుల్లో డబ్బులు ఇస్తున్నారు అని సమాచారం. ఇటీవలే యూనియన్‌లో ఒక నర్సు యాత్ర పేరుతో జోలే పట్టుకొని డబ్బులు వసూలు చేయడం తీవ్ర ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతి అక్రమ వసూలు లో నర్సింగ్ సూపరింటెండెంట్ వాట మరియు యూనియన్ నాయకుల వాటాలు తప్పనిసరిగా వెళు తున్నాయి అంటూ సొమ్ము ఒక్కరిదీ సోకు మరొకరిది అని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అభ్యంతరం తెలిపితే కక్ష్య సాధింపు పాల్పడటంతో నిరుమేధపని పరిస్థితి. దీనివెనుక ఉన్న యూనియన్ మెంబర్ అంటూ చెప్పుకొని దందా కు పాల్పడుతున్నట్టు ఒక నర్సింగ్ ఉద్యోగి పై ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో పనిచేసే చోట ఇతని పై తీవ్ర ఆరోపణలు వ్యక్తం. నర్సింగ్ సూపరింటెండెంట్ అక్రమాల పై నోరు మెదపని ఆసుపత్రి అధికారులు చర్యలు తీసుకోవడం లో జిల్లా కలెక్టర్ మరియు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు విఫలం అయ్యారంటూ పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. యూనియన్స్ అంటే ఉద్యోగుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసుకోవాలి తప్ప ఇలా పైసా వసూళ్లకు గొడవలకు కాదు అంటూ కాంట్రాక్ట్ స్టాఫ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం, అధికారులు స్పందించి వీరిపై చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి......?

**వసూళ్లపై అతిత్వరలో మరొక కథనంతో సూర్య వాస్తవం పాఠకుల ముందుకు తీసుకువస్తుంది....!**

# రేషన్ బియ్యం అక్రమ రవాణా రచ్చ






**పెళ్లకూరు – సూర్య వాస్తవం :** ప్రభుత్వం నిరుపేదల ఆహార భద్రత కోసం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమ వ్యాపారులకు వరప్రసాదంగా మారిన ఘటనలు వెలుగుచూస్తున్నాయి. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ పరిధిలో సేకరించిన రేషన్ బియ్యాన్ని దళారుల ద్వారా పెద్ద ఎత్తున సేకరించి, ఆటో రిక్షాలు మరియు ఇతర వాహనాల ద్వారా పొరుగు రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. స్థానికుల కథనాల ప్రకారం, మండలంలోని పలు గ్రామాల్లో కొందరు అక్రమ వ్యాపారులు తమ అనుచరులను నియమించి, పేదల నుండి తక్కువ ధరకు బియ్యాన్ని సేకరింపజేస్తున్నారు. అనంతరం ఆ బియ్యాన్ని నిల్వ కేంద్రాలకు తరలించి, అక్కడి నుండి ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తూ భారీ లాభాలు ఆర్జిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ తంతు ఒకటి రెండు రోజుల వ్యవహారం కాకుండా, గత కొన్ని సంవత్సరాలుగా నిరంతరంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. సోమవారం ఉదయం పెళ్లకూరు గ్రామంలోనే పట్టపగలే వాహనాల్లో రేషన్ బియ్యాన్ని లోడ్ చేస్తుండగా, విషయాన్ని చిత్రీకరించేందుకు ప్రయత్నించిన విలేఖరిపై దుర్భాష లాడుతూ బెదిరింపులకు దిగినట్లు సమాచారం. "మాకు అన్ని శాఖల అధికారులకు మామూలు కట్టాం, ఎవరూ ఏమీ చేయలేరు" అంటూ అక్రమ వ్యాపారులు బహి రంగంగానే హెచ్చరికలు జారీ చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.

మామూళ్ల ఆరోపణల నేపథ్యంలో పోలీసు, రెవెన్యూ, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖల అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఇలాంటి అక్రమాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. రేషన్ బియ్యం దుర్వినియోగం వల్ల నిజంగా అర్హులైన లబ్ధిదారులు నష్టపోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి ఆర్థిక నష్టం కలిగించడమే కాకుండా, పేదల హక్కులను హరించే ఈ అక్రమ వ్యవహారాలపై ఉక్కుపాదం మోపి, సూత్రధా రులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సంబంధిత ఉన్నతాధి కారులు దృష్టిసారించి, సమగ్ర విచారణ చేపట్టి అక్రమ రవాణా ముఠాలను బట్టబయలు చేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవ సరం ఎంతైనా ఉందని ప్రజాభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్నహస్తం

- వందలాది కుటుంబాలకి ఊరట
- రూ.5.11 కోట్ల సాయం
  డోన్ చరిత్రలో మైలురాయి
- ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి



**డోన్ – సూర్య వాస్తవం :** డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.35,97,311(అక్షరాలా ముప్పై ఐదు లక్షల తొంభై ఏడు వేల మూడు వందల పదకొండు రూపాయలు )విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 16 నెలల కాలంలో డోన్ నియోజకవర్గ పరిధిలోని ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కాల వ్యవధిలో నియోజకవర్గానికి చెందిన మొత్తం 543 మంది లబ్ధిదారులకు రూ.5,11,99,337 (అక్షరాల ఐదు కోట్ల పదకొండు లక్షల తొంభై తొమ్మిది వేల మూడు వందల ముప్పై ఏడు రూపాయలు) విలువైన ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంర్ఫ్) ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఆరోగ్య చికిత్సలు, అత్యవసర వైద్య అవసరాలు, ప్రమాదాలు మరియు ఇతర సంక్షేమ కారణాల నిమిత్తం పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపశమనం కలిగించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్న దానికి ఇది నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం అందేలా తగిన చర్యలు తీసుకుంటామని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు, ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# పేదల ఆరోగ్యానికి ప్రభుత్వ భరోసా

- పులివెందులలో 74 మందికి
  రూ. 40.96 లక్షల సీఎం రిలీఫ్
  ఫండ్ చెక్కుల పంపిణీ
- లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన
  పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి



**పులివెందుల – సూర్య వాస్తవం :** అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి అన్నారు. స్థానిక పులివెందుల టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి నియోజకవర్గానికి చెందిన 74 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 40,96,794 (నలభై లక్షల తొంభై ఆరు వేల ఏడు వందల తొంభై నాలుగు రూపాయల) విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మారెడ్డి లతా రెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ప్రాణాంతక వ్యాధులు, ప్రమాదాల బారిన పడి ప్రైవేట్ ఆసు పత్రుల్లో అధిక ఖర్చుతో వైద్యం చేయించు కున్న నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక సంజీవని లాంటిదని ఆమె అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా, సకాలంలో ఆర్థిక సహాయం అందుతోందని తెలిపారు. ఆపత్కాలంలో తమను ఆదుకుని





ఆర్థిక సాయం అందించిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్ర బాబుకి, అలాగే తమకు అండగా నిలిచిన పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవికి, జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డికి ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## హలో బీసీ.. చలో తిరుపతి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

### - రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్





**కర్నూల్ – సూర్య వాస్తవం :** ఈనెల 4న తిరుపతిలో నిర్వహించనున్న హలో బీసీ.. చలో తిరుపతి మహాసభను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు బీసీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర యాదవ్ మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువచ్చి అసెంబ్లీ, పార్లమెంట్‌లలో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.బీసీల హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా చర్చ ప్రారంభించాలనే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని భారీ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా బిల్లులో బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని, రాజకీయాల్లో బీసీలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కేంద్ర మంత్రివర్గంలో బీసీలకు కీలక శాఖలు కేటాయించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న బీసీ భవనాలకు కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసి పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమానికి జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య హాజరవుతారని వెల్లడించారు.

## రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టల భవిష్యత్‌పై వైసీపీ సమీక్ష సమావేశం




**ఉరవకొండ – సూర్య వాస్తవం :** వైసీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, గ్రేటర్ రాయలసీమలో పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి, రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్లక్ష్య వైఖరితో గ్రేటర్ రాయలసీమకు చేస్తున్న అన్యాయం గురించి వైయస్ఆర్ కడప జిల్లాలో "మేడ కన్వెన్షన్‌లో గ్రేటర్ రాయలసీమ ఎత్తిపోతల పథకం భవిష్యత్ కార్యాచరణ" సమావేశానికి వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వరరెడ్డి మరియు మాజీ ఎమ్మెల్యేలు ముఖ్య నాయకులు హాజరుయ్యారు.

## ఘనంగా మహిళల సాధికారత - భద్రతపై జేఎన్‌టీయూఏసీఈలో వాకథాన్






**పులివెందుల – సూర్య వాస్తవం :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం--2026 సందర్భంగా పులివెందుల జేఎన్టీయూ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో, డైరెక్టర్ ఆఫ్ ఆధ్యాపిక బృందం మరియు మహిళా ఉద్యోగలు మరియు జె.ఎన్.టి.యు అనంతపూర్ సహకారంతో "మహిళల సాధికారత -- భద్రత మరియు రక్షణ" పేరిట వాకథాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పులివెందుల ద్వితీయ శ్రేణి ప్రత్యేక న్యాయమూర్తి చింతపర్తి అరుణ హాజరై వాకథాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత సమాజ అభివృద్ధికి మూలస్తంభమని పేర్కొన్నారు. మహిళల భద్రత, సమానత్వం, గౌరవం కోసం ప్రతి ఒక్కరూ చైతన్యంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలకు అందుబాటులో ఉన్న టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ల ప్రాముఖ్యతను వివరిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో వాటిని వినియోగించడం ద్వారా తక్షణ సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. విష్ణు వర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ డా. కె. శేష మహేశ్వరమ్మ, మహిళా సాధికారత సమన్వయకర్త డా. షేక్ తాజ్ మహబూబ్ పాల్గొన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వాకథాన్‌ను విజయవంతం చేశారు.మహిళల సాధికారత, భద్రతపై అవగాహన పెంపొందించడంలో ఈ కార్యక్రమం విశేషంగా దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు.

# రాష్ట్రానికి బీజేపీ ఒక శనిగ్రహం

- వైసీపీ, టీడీపీలు రాహుకేతువులు
- రాయలసీమ గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీ, వైసీపీ, టీడీపీలకు లేదు
- బీజేపీ, వైసీపీ, టీడీఎలు రాష్ట్రానికి ద్రోహం, మోసం, అన్యాయం చేశాయి
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం:** రాష్ట్రానికి బీజేపీ ఒక శనిగ్రహంలా, వైకాపా, టీడీపీలు రాహు కేతువులుగా దాపురించాయని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ పై మూడు పార్టీలు రాయలసీమకు తీరని ద్రోహం, మోసం,అన్యాయం చేశాయని,ఆ మూడు పార్టీలకు రాయలసీమ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని తులసి రెడ్డి అన్నారు. 1937 నాటి శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని, హైకోర్టు ఈ రెండింటిలో ఒకదానిని రాయలసీమలో ఏర్పాటు చేయాల్సి ఉండగా పై మూడు పార్టీల కారణంగా ఆ రెండింటిలో ఒకటే కూడా రాయలసీమలో ఏర్పాటు కాలేదు అన్నారు. ప్రత్యేక హోదా అటు రాయలసీమకు ఇటు మొత్తం రాష్ట్రానికి సంజీవని లాంటిది. ఇది రాష్ట్ర హక్కు.ప్రత్యేక హోదా వచ్చి ఉంటే ఈపాటికి నవ్యాంధ్ర స్వర్ణాంధ్రై ఉండేది. పై మూడు పార్టీల కారణంగా ప్రత్యేక హోదా అమలు కాక అటు రాయలసీమ, ఇటు రాష్ట్రం తీవ్రంగా నష్టపోయాయి. విభజన చట్టంలో సెక్షన్ 46 సబ్ సెక్షన్ 3 ప్రకారము కేంద్ర ప్రభుత్వము రాయలసీమకు, ఉత్తరాంధ్ర జిల్లాలకు బుందేల్ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు ఇవ్వాల్సి ఉండగా పై మూడు పార్టీల కారణంగా ఈ నిధులు రాలేదు.ఆ విధంగా రాయలసీమకు, ఉత్తరాంధ్రకు పై మూడు పార్టీలు అన్యాయం చేశాయి. విభజన చట్టంలో 13వ షెడ్యూల్డ్ ప్రకారము కేంద్ర ప్రభుత్వం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కడప జిల్లాలో సమీకృత ఉక్కు కర్మాగారాన్ని నిర్మించాల్సి ఉండగా 11 సంవత్సరాలు దాటిన అతీగతీలేదు.ఈ విధంగా పై మూడు పార్టీలు రాయలసీమకు ద్రోహం చేశాయి. రాయలసీమ సమగ్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం 2008 - 2009 రైల్వే బడ్జెట్ లో కడప - రాయచోటి -మదనపల్లి బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గాన్ని మంజూరు చేసి మొదటి పేజ్ లో కడప నుంచి పెండ్లి మర్రి వరకు లైన్ పూర్తి చేయడం జరిగింది.కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి.ఆ విధంగా పై మూడు పార్టీలు రాయలసీమకు ద్రోహం చేశాయి. రాయలసీమలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన తెలుగుగంగా, గాలేరు నగిరి, హంద్రీనీవా ప్రాజెక్టులు నిధులు లేని కారణంగా గత 11 సంవత్సరాలుగా నత్తనడక సాగుతూ ఉండడం దురదృష్టం. అన్నమయ్య జిల్లాలో అన్నమయ్య ప్రాజెక్టు 2021లో కొట్టుకుపోయినప్పటికీ ఇప్పటివరకు ఆ ప్రాజెక్టు గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడం శోచనీయం. కృష్ణానది యాజమాన్యం బోర్డ్ కార్యాలయాన్ని తెలంగాణలోని హైదరాబాద్ నుంచి రాష్ట్రానికి, రాయలసీమకు ఇప్పటివరకు తరలించకపోవడం శోచనీయం. ఎగువ రాష్ట్రమైన కర్ణాటక ఆల్మట్టి ఎత్తును పెంచుతూ ఉంటే,తెలంగాణ ప్రభుత్వం ఏ అనుమతులు లేకుండా పాలమూరు - రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తూ ఉంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని వైకాపా,టీడీపీ పార్టీలు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం అత్యంత దురదృష్టకరమని తులసి రెడ్డి అన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి 2020 అక్టోబర్ 29న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ స్టే విధించగా స్టేట్ ఎత్తివేతకు అటు వైకాపా ప్రభుత్వం, ఇటు టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేయకపోవడం గర్హనీయమని తులసి రెడ్డి అన్నారు. అందువల్లనే రాయలసీమ గురించి మాట్లాడే నైతిక హక్కు అటు బిజెపికి గాని, ఇటు వైకాపా, టిడిపిలకు గాని ఏ మాత్రం లేదని తులసి రెడ్డి విరుచుకుపడ్డారు.

# ఇరాన్ సుప్రీమ్ నేత హత్య అత్యంత దుర్మార్గం

- ఐక్యరాజ్యసమితి చట్టాలను ఉల్లంఘిస్తున్న నరహంతక రాజ్యాలు
- దీనిని తప్పు పట్టిన యునైటెడ్ జేపీసీ నాయకులు



**అనంతపురం - సూర్య వాస్తవం :** సోమవారం యుజెఏసీ ఆధ్వర్యంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ సి.జాఫర్, అనంతపురం మేయర్ వసీం, దాదా గాంధీ మాట్లాడుతూ ఇరాన్ సుప్రీమ్ నేత ఆయతుల్లా అలీ ఖమేనీ హత్యకు నిరసనగా రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ సంతాపం వ్యక్తం చేశారు. ఇరాన్ సుప్రీం నేత ఆయాతుల్లా అలీ ఖమేనీ 1989లో అధికార పగ్గాలు చేపట్టి 37 సంవత్సరాలు పరిపాలన చేశారు. ఆది నుండి భారతదేశం పాలస్తీనా దేశానికి మద్దతు ఇవ్వడం జరిగింది. కానీ మోడీ ఇజ్రాయిల్ పర్యటన చేసి వాణిజ్య ఒప్పందం అనంతరం రెండు రోజుల లోపల సామ్రాజ్యవాద దేశాలు దాడులకు తెగబడ్డారు. ఇరాన్‌పై అమెరికన్ సామ్రాజ్యవాదం, ఇజ్రాయిల్ నరహంతక దేశాలు అంతర్జాతీయ చట్టాలను, ఐక్యరాజ్యసమితి ప్రాథమిక హక్కులను ఉల్లంఘన చేస్తూ ఏకపక్ష దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఖమేనీతో పాటు కుటుంబ సభ్యులను, 40 మంది కమాండర్లను హతమార్చడం దుర్మార్గపు చర్య ఒక సంవత్సరం క్రితం అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు కూడ బలుక్కొని ఇరాన్ పైన 12 రోజులపాటు యుద్ధం ప్రకటించారు. ఇరాన్ వద్ద అన్వస్త్రాలు తయారు చేసే యురేనియం ఉందని ఉన్మాదపు చర్యలకు పాల్పడుతున్నారు. గతంలో ఇరాక్‌లో రసాయనాయుధాలు ఉన్నాయని యుద్ధం ప్రకటించి 5 లక్షల మందిని చంపి సద్దాం హుస్సేన్ ఉరి తీశారు. తన తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటిదాకా ఎటువంటి రసాయనా ఆయుధాలు లేవు. యుద్ధ పిపాసి అమెరికా సహకారంతో ఇజ్రాయిల్ ద్వారా పాలస్తీనియన్లు పైన దాడులు చేస్తూ మహిళలను పిల్లలను ఊచకోత కోస్తూ 70 వేల మందిని పొట్టన పెట్టుకున్నారు. యుద్ధం ఆగిన గాజా పైన దాడులు చేస్తున్నారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ పెద్దన్నగా క్రూరత్వంగా వెనిజులా పై దాడి చేసి సైన్యాన్ని చంపి మధుర ఆయన భార్యను కిడ్నాప్ చేసి అమెరికాలో నిర్బంధించారు. చమురు కోసం గల్ఫ్ దేశాల ఆధిపత్యం కోసం కుట్రలు కుతంత్రాల ద్వారా ప్రభుత్వాలను పడగొట్టి అమెరికా తొత్తు ప్రభుత్వాలను ఏర్పాటు చేయడానికి పూనుకుంటున్నది. అంగీక రించని, మడమ తిప్పని, లొంగని ఇరాన్ సుప్రీమ్ నేత ఆయతుల్లా అలీ ఖమేనీ అంతమొందించడానికి కుట్ర పన్ని సైనిక చర్యకు పాల్పడటాన్ని యూజెఏసీ తీవ్రంగా ఖండిస్తున్నది. ఖమేనీ హత్య తర్వాత ప్రతీకార దాడులతో ఇరాన్ గల్ఫ్ దేశాలలో అమెరికా స్థావరాల పైన దాడులు చేస్తున్నది. దీన్ని వక్రీకరిస్తూ ప్రకటనలు చేస్తున్నారు. రంజాన్ పవిత్ర మాసంలో ఉపవాసులుంటున్న సమయంలో ఖురాన్ పఠన మాసంలో దాడులకు తెగబడడం ఉగ్రవాద చర్య అంతేకాకుండా బాంబులు వేసి బడి పిల్లలను చంపడం దాష్టీకం. ఖమేనీ మరణం కంటే ముందు నన్ను చంపుతారని అయినా ఆ మరణం కంటే ఇరాన్ దేశం గొప్పది. శత్రువు ముందు తలవంచరాదని చెప్పడం జరిగింది. యుద్ధం అమెరికా, ఇజ్రాయిల్ ప్రారంభించారు. ముగింపు మేము చేస్తామని ఇరాన్ ప్రకటించింది.

భారతదేశానికి ఇరాన్ సహకారం, రష్యా స్నేహం అవసరం కావున అమెరికా ఇజ్రాయిల్ దేశాల దుశ్చర్యలను భారత ప్రధాని మోడీ ఖండించాలని యుజెఏసి డిమాండ్ చేస్తున్నది. ఇప్పటికైనా అంతర్జాతీయ చట్టాలు జోక్యం చేసుకోవాలని, ఐక్యరాజ్యసమితి కలుగజేసుకొని యుద్ధం నివారించడానికి ప్రయత్నాలు చేయాలని యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది అని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ జేపీసీ నాయకులు కార్పొరేటర్ ఇసాక్ మదిని, ముత్తవల్లి షౌకత్, జాకీర్, ఆవాజ్ వలి, సైఫుల్ల బేగ్, హాజీ పీరా, జే యం భాష, సిపిఐ అల్లీ పీరా, జక్రియ, బాబా సాహెబ్, వేముల నదీమ్ తదితరులు పాల్గొన్నారు.



# ఏపీ ఆదర్శ పాఠశాలలో వ్యాస రచన పోటీలు

**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి మండలంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో అనంతపురం జిల్లా ఎస్పీ, గుంతకల్ డిఎస్పి, గుత్తి సీఐ రామారావు ఆదేశాల మేరకు ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని గుత్తిలో ఉన్న ఏపీ ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి, పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీలకు ఎస్సైలు సురేష్, అమీర్ ఖాన్ ఆధ్వర్యంలో మహిళా సమస్యల పరిష్కారంలో పోలీస్ పాత్ర, సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిస్కార మార్గాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామాంజనేయులు, గుత్తి పోలీస్ శాఖ సిబ్బంది, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశస్థ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

# డిప్యూటీ డీఈఓగా లక్ష్మణ్

**గుత్తి- సూర్య వాస్తవం :** గుత్తి డివిజన్ డిప్యూటీ డీఈఓగా లక్ష్మణ్ నియమితులయ్యారు. కణేకల్లు-1 ఎంఈ ఓగా పని చేస్తున్న ఆయనకు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మేరకు ఆయన ఒకటి ఎండు రోజుల్లో బాధ్యతలు చేపట్టను న్నారు.ఇక్కడ డిప్యూటీ డీఈఓగా పని చేసిన మల్లారెడ్డి ఉ ద్యోగ విరమణ చేసిన సంగతి తెలిసిందే.

# ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా డీటీ ప్రసన్న రాణి



**డక్కిలి - సూర్య వాస్తవం:** జనగణన అధికారులకు తిరుపతిలో మూడు రోజులు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ చేపట్టారు.ఈ శిక్షణ తరగతులకు జిల్లా అధికారులు, డివిజన్, మండల అధికారులు అందరూ పాల్గొంటున్నందువలన డక్కిలి మండల ఇన్‌ఛార్జి తహశీల్దారుగా డిప్యూటీ తహశీల్దార్ ప్రసన్నరాణి మార్చ్ 5వ తేదీ వరకు ఉంటారని డక్కిలి మండల తహశీల్దార్ ఎం.శ్రీనివాసులు ఒక ప్రకటనలో మండల ప్రజలకు తెలియజేశారు.

# విద్యార్థి ఆత్మహత్యకి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఏఐఎస్ఎ కడప జిల్లా కో- కన్వీనర్ దినేష్ కుమార్



**పులివెందుల - సూర్య వాస్తవం :** ప్రొద్దుటూరు పట్టణంలోని నడింపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో పదవ తరగతి చదువుతున్న నరసింహులు అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని సోమవారం ఏఐఎస్ఎ దినేశ్ కుమార్ కడప జిల్లా కో-కన్వీనర్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భద్రతను బాధ్యత వహించాల్సిన దుస్థితి చూస్తే అధికారులు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంతో ఎంత వ్యవహరిస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యార్థి ఉంటున్న వసతి గృహం ఆవరణంలోనే విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటూ ఉంటే అక్కడ ఉన్న వార్డెన్, సిబ్బంది నిర్లక్ష్య వైఖరిని ఉందన్నారు. దశలవారీగా ఆత్మహత్యలు జరుగుతున్న అధికారులు ఎలాంటి రక్షణ సౌకర్యం కల్పించకపోవడం దుర్మార్గం. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తుండగా కానీ అధికారులు మాత్రం నిర్లక్ష్యంతోనే విద్యార్థులను మరణిస్తున్నారు. వెంటనే విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకొని సమగ్రవిచారణ చేపట్టి కారకులైన వారి పైన క్రిమినల్ కేసు నమోదు చేయాలని వారి డిమాండ్ చేశారు లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు.

# పేదలకు అండగా మారెడ్డి కుటుంబం

- టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు మిద్దె మురళి




**తొండూరు - సూర్య వాస్తవం :** పులివెందుల టిడిపి కార్యాలయంలో తొండూరు మండలం మదూరు గ్రామం ఎస్సీ కాలనీ చెందిన కత్తి నాగయ్య కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పులివెందుల జడ్పిటిసి మా రెడ్డి లతా రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మిద్దె మురళి మాట్లాడుతూ మారెడ్డి లతా రెడ్డెమ్మకు కృతజ్ఞతలు తెలుపుతూ నాగయ్య పేదరికంలో ఉన్నప్పటికీ కుటుంబ పోషణ కోసంకూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారు నాగయ్య వాళ్ళ అమ్మ అనారోగ్యంతో మంచానికి పరిమితమైన కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరగా నిలిచిందని ఎస్సీలకు మా రెడ్డి కుటుంబం అండగా ఉంటుందని వారన్నారు

# రైతులకు సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలి


- గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు
- భూమిరెడ్డి ఉమాదేవి



**వేముల - సూర్య వాస్తవం:** ముద్దుల పండగ సందర్భంగా సోమవారం స్థానిక చింతల జూటూరు గ్రామంలో శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమా దేవి పాల్గొన్నారు. చింతలజూటూరు గ్రామాలలో ఆదివారం నిర్వహించిన ముద్దుల పండగ సందర్భంగా స్థానిక చింతల జూటూరు గ్రామానికి చెందిన అన్నా రెడ్డి గంగిరెడ్డి (అద్వానీ)టీడీపి నాయకుల పిలుపుమేరకు ముఖ్యఅతిథిగా శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమా దేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భూమిరెడ్డి ఉమా దేవి గ్రామదేవతను అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రతి సంవత్సరం సాంప్రదాయంగా నిర్వహించే ఈ ముద్దుల పండుగలో రైతులకు మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో టీడీపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీతారాముల గుడి నిర్మాణానికి రూ.25వేల ఆర్థిక సాయం

**తనకల్లు - సూర్య వాస్తవం:** శ్రీ సత్య సాయి జిల్లా తనకల్లు మండల పరిధిలో మల్లిరెడ్డిపల్లి పంచాయతీ గుర్రంబైలు గ్రామంలోని నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీత రాముల స్వామి గుడి నిర్మాణం కోరకు టీడీపీ యువనాయకుడు రాజ్ కుమార్, స్వాతి దంపతులు తమ వంతు ఆర్థిక సాయంగా రూ. 25వేలు స్వామి వారి కృపకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో-కన్వీనర్ బ్రహ్మానంద రెడ్డి, ఎక్స్ ఎంపీపీ హరి నాయక్ గ్రామప్రజలు నాగభూషణం, సీన, నాగార్జున, వెంకటేసులు, తిరుపతయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



# రైతుల భూములు సోలార్‌కు అప్పగిస్తే అడ్డుకుంటాం

**- వ్యవసాయ కార్మిక సంఘం**



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠం మండలంలోని పరుగురాళ్లపల్లి, పాపిరెడ్డి పల్లె రెవెన్యూ పొలాల్లోని 176 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సోలార్ కంపెనీకి కేటాయించడం దుర్మార్గమని అదే రకంగా మొత్తంగా కేటాయించిన 600 ఎకరాల్లో అనేక అరటి తోటలు, జామ తోటలు కొబ్బరి తోటలు ఇతర పంట పొలాలు వందల ఎకరాల్లో ఉన్నాయని వీటన్నిటిని సోలార్ వారికి కేటాయించాలనుకోవడం దుర్మార్గమని వెంటనే ప్రభుత్వం సోలార్ కు కేటాయించిన భూములను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు సానా గోవింద స్వామి, హరి, ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్‌లు డిమాండ్ చేశారు. సోమవారం బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....

400 ఎకరాల స్థలాన్ని సోలార్ కు కేటాయించడం సరైనది కాదని ఓ పక్క పేదలకు భూములు లేక అల్లాడుతుంటే మరోపక్క పేదలకు చెందాల్సిన భూములను ప్రైవేట్ కంపెనీ అయినా సోలార్ కు కేటాయించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. రైతులు అప్పులు చేసి పంటలు పండించుకొని పంట రాక, పెట్టిన పట్టుబడి రాక పంటపోలంలోనే రైతు పురుగుల మందు తాగి ప్రాణాలు వదులుతున్నారని వారు అన్నారు. అలాంటి రైతులకు చెందిన భూములను నేడు ప్రభుత్వం సోలార్‌కి ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. సోలార్ కు కేటాయించిన భూములను పరిశీలించడం కోసం గురువారం నాడు వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు ఈ ప్రాంతాల్లో పర్య టించడం జరుగుతుందని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి పంటలు పండే భూములను, సాగులో ఉన్న భూములను, రైతులకు చెందిన భూములను సోలార్‌కు ఇవ్వాలనే ఆలోచనను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పేదలను, రైతులను కలుపుకొని ఆందోళన కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గండి గురయ్య, చిన్నప్ప లు పాల్గొన్నారు.

# వెల్ఫేర్ బోర్డులో పెండింగ్ క్లైమ్‌లను వెంటనే చెల్లించాలి

**- ఏఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బల్లారపు రామాంజనేయులు**



**వేంపల్లె - సూర్య వాస్తవం:** గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న క్లైమ్లను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికులు, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం (ఏఐటియుసి అనుబంధం) జిల్లా అధ్యక్షులు బళ్లారాపు రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు చల్లా బాలాజీ డిమాండ్ చేశారు. సోమవారం వేంపల్లి గాంధీ రోడ్డు గొర్లమండల ఓల్డ్ మిషన్లోని కార్మికుల ఆఫీషులో సమావేశమై కార్మికులు పెద్దత్తున పాల్గొన్నారు వారు మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం హయామ్ లో మూలన పడిన భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డును పునరుద్ధీకరించడం,కార్మికుడికి గుర్తింపు కార్డులు కొత్త సభ్యుల నమోదు,పెళ్లి కానుక ప్రసూతి సౌకర్యం, సహజ మరణం సందర్భంగా ఇచ్చే సహాయం, మట్టి ఖర్చుల వంటి పాత పథకాలను కొనసాగించాలని, నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వల్లెపు బుజ్జిబాబు, దేరంగుల శ్రీనివాసులు, కొమ్మెర గోపాల్, షేక్ బాబా ఫక్రుద్దీన్, పటాన్ కులాయప్ప తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే నా బలం.. మీ నమ్మకమే నా ఊపిరి!

**- స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయఢంకా మోగిస్తాం**

**- రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు**



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం మదనపల్లి పట్టణంలోని రామ తులసి కన్వెన్షన్‌లో సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. రాజంపేట పార్లమెంట్ నూతన అధ్యక్షుడిగా సుగవాసి ప్రసాద్ బాబు తో పాటు నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఏడు నియోజకవర్గాల నుండి సుమారు 10 వేల మందికి పైగా కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యేలు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, షాజహాన్ బాషా, రెడ్డప్పగారి శ్రీనివాసులు రెడ్డి, ఇన్చార్జిలు రూపానంద రెడ్డి, జగన్మోహన్ రాజు, చల్లా బాబు, కార్పొరేషన్ ఛైర్మెన్లు, డైరెక్టర్లు, రాష్ట్ర స్థాయి నాయకులు, టిడిపి సీనియర్ మహిళలు, తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన చంద్రబాబు నాయుడుకి, లోకేష్ బాబుకి, పల్లా శ్రీనివాస రావుకి ధన్యవాదాలు తెలిపారు. "నాయకులకు, కార్యకర్తలకు మధ్య సమన్వయ కర్తగా ఉంటూ, ప్రతి కార్యకర్తకు అండగా నిలబడతాను.



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ జెండా ఎగుర వేస్తాం. ఎమ్మెల్యేలు, ఇన్చార్జిల సమన్వయం తో కలిసి పనిచేస్తామని తెలిపారు. 2029 ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ స్థానాన్ని గెలుచుకోవడమే మా లక్ష్యం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి నన్ను ఆశీర్వదించిన నాయకులకు కార్యకర్తలకు, అభిమానులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు

# టొమోట ప్రాసెసింగ్, జోడింపుపై నైపుణ్య అభివృద్ధి సందర్శన




**వేంపల్లె - సూర్య వాస్తవం:** పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల వారి ఆధ్వర్యంలో "టొమోట ప్రాసెసింగ్, విలువ జోడింపుపై నైపుణ్య అభివృద్ధి" అనే ఐ.సి.ఏఆర్ షెడ్యూల్డ్ ఉప ప్రణాళిక ప్రాజెక్ట్‌లో భాగంగా రెండవ గ్రూపుతో పరిశ్రమ సందర్శన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ రెండవ గ్రూపుతో పరిశ్రమ సందర్శన కార్యక్రమంలో భాగంగా పులివెందుల మరియు వేంపల్లె మండల పరిసర ప్రాంతాలకు చెందిన ఔత్సాహిక ఎస్సీ కులాల యువత, రైతులుని చిత్తూరు జిల్లాలో "ఫీల్ ఫ్రెష్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్" పరిశ్రమకు తీసుకొని వెళ్ళి టమోటా ప్రాసెసింగ్ చేసి టమోటా నుండి గుజ్జు, టమోటా ప్యూరీ తయారు చేయు విధానం, నిల్వ ఉంచే పద్ధతులు, ఎస్ఎప్టిక్ ప్యాకేజింగ్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఇంచార్జ్ ఇంజినీర్ నజ్మా మాట్లాడుతూ టమోటో ప్రాసెసింగ్ విధానాన్ని తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని, టమోటా గుజ్జును తయారుచేసి ఎసెప్టిక్ ప్యాకేజింగ్ ద్వారా ఎక్కువ నెలలు నిల్వ ఉంచవచ్చని, తద్వారా టమోటాల వృధా అరికట్టవచ్చని కార్యక్రమంలో అన్నారు. తాజాగా పండిన టమోటాలు త్వరగా పాడవుతాయని కానీ ప్రాసెసింగ్ ద్వారా టొమోటా గుజ్జు, ప్యూరీ, పేస్ట్, సాస్ మొదలగు ఉత్పత్తులు చేసి మంచి ప్యాకేజింగ్ చేయడం ద్వారా ఎక్కువ కాలం నిల్వ ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా టమోటా ప్రాసెసింగ్ విధానాన్ని విచ్చేసిన ఔత్సాహిక ఎస్సీ కులాల వారు ప్రత్యక్ష పరిశీలన చేశారు. ఈ పరిశ్రమ సందర్శన కార్యక్రమం ద్వారా టమోటా ప్రాసెసింగ్ గురించి పూర్తిగా తెలిసిందని విచ్చేసిన ఔత్సాహిక ఎస్సీ కులాల వారు పేర్కొన్నారు. ఈ రెండవ గ్రూపుతో పరిశ్రమ సందర్శన కార్యక్రమానికి కళాశాల ప్రాజెక్ట్ ఇన్చార్జ్ ఇంజినీర్ నజ్మా, ప్రాజెక్టు మెంబర్ డాక్టర్ కీర్తి రెడ్డి, పులివెందుల, వేంపల్లె మండల పరిసర ప్రాంతాలకు చెందిన ఔత్సాహిక ఎస్సీ కులాల వారు, కళాశాల విద్యార్థులు గిరీష్, పవన్, హర్షవర్ధన్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# వయోజన విద్యను అందించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ధ్యేయం



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి మున్సిపాలిటీలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వయోజన విద్య ద్వారా నిరక్షరాస్యతను తగ్గించేందుకు సచివాలయ సిబ్బంది, మెప్మా అధికారులు, ఆర్‌పి సిబ్బంది ద్వారా వయోజన విద్యను అందించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బృహత్తర కార్యనిర్వహణను అమలు పరుస్తూ ఈనెల 4వ తేదీ ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్, ఈ నెల 15వ తేదీ ఫైనల్ ఎగ్జామ్‌లను సచివాలయ సిబ్బంది, మెప్మా అధికారుల సహకారంతో పూర్తి చేయించుటకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడ మైందని కమీషనర్ బి.జబ్బార్ మియా ఈ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ ప్రక్రియను సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది సహకారంతో విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎడ్యుకేషన్ కో-ఆర్డినేట ర్ వెంకటేశ్వర్లు, మెప్మా టి.య మ.సి చంద్రశేఖర్, సి.ఓ షరీఫ్, సచివాలయ సిబ్బంది,డి.పి. ఓ నరేష్, మెప్మా ఆర్.పి లు, మునిసిపల్ సిబ్బంది పాల్గొ న్నారు.

# రాయుడు కాలనీలో ఆధార్ సెంటర్ ప్రారంభం



**రాయచోటి - సూర్య వాస్తవం:** ప్రస్తుత కాలంలో ప్రభుత్వ, ప్రైవేటు పనుల్లో చాలా వాటికి ఆధార్ కార్డు తప్పనిసరి అయిపోయిందని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షాకత్ అలీ, సహాయ పాధ్యాయురాలు లలితా అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని రాయుడు కాలనీలో విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రుల, ప్రజల విజ్ఞప్తి మేరకు అక్కడ ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల నియోజనాలు పొందాలన్న ఇది అనివార్యం. వీటిని భారతదేశ గుర్తింపు ప్రాధికార సంస్థ జారి చేస్తుందని అన్నారు. 12 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య మరియు చిరునామాకు సార్వత్రిక పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబక్తుల్లా కాలనీ, ఏజీ గార్డెన్స్, శ్రీనివాసపురం, వండాడి, తూర్పుపల్లి, మల్లూరు, బలిజ పల్లి ప్రజలు సేవలను వినియోగించుకొనవలసినదిగా వారి అందరికీ తెలియజేశారు.కార్యక్రమంలో జాకీర్, జాఫరుద్దీన్, రియాజ్, అబిదా, మోహిన్ షేక్, ఖాదర్ బాషా, ఇమ్రాన్ ఖాన్, భాస్కర్, షమ్ము, మాలికా బేగం, చాంద్ బేగం, అసద్, సయ్యద్, ఆధార్ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.




# వికారాబాద్ కాంగ్రెస్ శిక్షణ శిబిరంలో ఆత్మీయ సమ్మేళనం

**- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలరెడ్డిలతో మమేకమైన అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్**


**రాయచోటి - సూర్య వాస్తవం:** కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో నూతన ఉత్తేజాన్ని నింపే దిశగా తెలంగాణ లోని వికారాబాద్‌లో ఏఐసీసీ ఆధ్వర్యంలో 'సంగఠన్ సృజన్ అభియాన్' పేరిట జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుల శిక్షణ కార్యక్రమం అట్టహాసంగా జరిగి తాగి సోమవారం ముగిసింది. ఈ శిక్షణ శిబిరంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో కలిసి పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం కేవలం రాజకీయ శిక్షణకే పరిమితం కాకుండా, ఒక ఆత్మీయ కుటుంబ సమ్మేళనంగా సాగింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా, పట్టణ అధ్యక్షులతో పాటు వారి కుటుంబ సభ్యులను సైతం రాహుల్ గాంధీ, వైఎస్ షర్మిల ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ఎలాంటి బేషజాలు లేకుండా వారితో మమేకమై ఫొటోలు దిగి ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కు చెందిన అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ ఆత్మీయ కలయికలపై ఆయనసంతోషం వ్యక్తం చేశారు.శిక్షణ కార్యక్రమంలో భాగంగా రాహుల్ గాంధీ, వైఎస్ షర్మిల తో కలిసి తోటి అధ్యక్షుల కుటుంబ సభ్యుల ను పలకరించడం తనకెంతో సంతోషాన్నిఇచ్చిందనిఆయన చెప్పారు. అగ్రనేతలు తమను కేవలం పార్టీ నాయకులుగా కాకుండా, కాంగ్రెస్ కుటుంబంలో ఒకరిగా ఆదరించి, మమేకం అవ్వడం పార్టీ శ్రేణుల్లో మరింత స్థైర్యాన్ని, ఉత్సాహాన్ని నింపిందని ఆయన తెలిపారు. అట్టడుగు స్థాయి నాయకులను, వారి కుటుంబాలను అగ్రనేతలు స్వయంగా కలిసి ఉత్సాహ పరచడం ద్వారా రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# రెండు ద్విచక్ర వాహనాలు ఢీ ఒకరు మృతి



**లింగాల - సూర్య వాస్తవం:** లింగాల మండలం ఇపట్ట గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టిన సంఘటన చోటు చేసుకున్నారు. ఈ ఘటనలో అనంతపురం జిల్లా గొడ్డుమర్రి గ్రామానికి చెందిన కప్పల గంగాధర్(35) అనే వ్యక్తి మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన తర్వాత పూర్తి వివరాలు తెలుపుతామన్నారు.

# డీఈఓ కార్యాలయానికి ఏసీ వితరణ



**అనంతపురం- సూర్య వాస్తవం :** అనంతపురం ఆదిమూర్తినగర్‌లోని జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయానికి అవసరమైన ఎయిర్ కండీషనర్(ఏసీ)ని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డి వితరణగా సోమవారం అందించారు. రూ.35 వేలు విలువ చేసే ఏసీని డీఈఓ కార్యాలయంలోని ఐటీ సెల్ విభాగానికి ఆయన అందించారు. వీటిని డీఈఓ కడప ప్రసాద్ బాబు, ఏడీ-1 కడప మునీర్ ఖాన్ చేతుల మీదుగా బహూకరించారు. ఒకవైపు విధి నిర్వ హణలో బిజీగా ఉంటూనే, మరోవైపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, ఇంకో వైపు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి కృషిని డీఈఓ ప్రసాద్ బాబు, ఏడీ-1 మునీర్ ఖాన్ కొనియాడారు. ఉపాధ్యాయ లోకానికి ఆయన ఆదర్శంగా నిలవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆదినారాయణ, ఐటీ సెల్ ఇన్చార్జ్ చంద్రశేఖర్రెడ్డి, నోడల్ ఆఫీసర్ రాంప్రసాద్, ఏఎస్ బోయ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్ పాల్గొన్నారు.

### నిట్ ఫౌండేషన్ - ఇన్ఫోసిస్ సహకారంతో

# ఐదు రోజుల శిక్షణ ప్రారంభం

### - ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులు



**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం పట్టణంలోని స్థానిక ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో కెరీర్ డెవలప్మెంట్ సెల్ ఆధ్వర్యంలో, నిట్ ఫౌండేషన్, ఇన్ఫోసిస్ సంస్థల సహకారంతో విద్యార్థుల కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ నైపుణ్యాలను అభివృద్ధి చేయుటకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం నాడు ప్రారంభించారని కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. సరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం తొలి రోజు నిట్ ఫౌండేషన్ తరపున నిపుణులు మహాలక్ష్మి హాజరై విద్యార్థులకు ప్రాయోగిక విధానంలో శిక్షణ అందించారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, సమర్థవంతమైన సంభాషణా నైపుణ్యాలు అలవర్చడం, ఇంటర్వ్యూలలో మెరుగైన ప్రదర్శన సాధించేందుకు అవసరమైన అంశాలపై మార్గనిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీడీసీ కన్వీనర్ డా.కె.పి. వెంకటేశ్వర రావు, సభ్యులు డా. ఎం. బాబా ఫక్రుద్దీన్, డా.ఆర్. శాంతి, డా. కె. శారద, డా. ఆర్. మాధవి,ఎస్. శివ ప్రసాద్ రెడ్డి, ఎం. సురేంద్ర, అధ్యాపకులు ఎం. జైనుబేగం, బి. యోగేశ్వర్ తదితరులు మరియు నమోదు చేసుకున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన కళాశాల ప్రెసిడెంట్ పి.వి. రమణారెడ్డి, సెక్రటరీ కె.నిర్మలమ్మ, కరెస్పాండెంట్ పి.ఎల్.ఎన్. రెడ్డిలకు నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# నేడు శ్రీ కొండా సింగ రాయుడు స్వామి ఉత్సవాలు



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:**
మండల కేంద్రంలోని మిట్టమానపల్లె వెళ్లే దారిలో శ్రీ ఈశ్వరమ్మ గృహ దగ్గరలో ఉన్న శ్రీ కొండ సింగరాయుడు స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతాయని దేవదాయ శాఖ ఆలయ ఈవో ఎస్ .రామలింగారెడ్డి తెలిపారు. శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ కొండ సింగ రాయుడు స్వామి ఉత్సవాలు ఈనెల మూడవ తేదీ మంగళవారం ఉదయం సుప్రభాత సేవ ,గ్రామస్తులు భజన కార్యక్రమం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ,మధ్యాహ్నం అన్నదానంతో ముగుస్తాయని ఈ కార్యక్రమంలో భక్తులు స్థానిక ప్రజలు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఈవో పేర్కొన్నారు.

# విరాళం కాదు.... సామాజిక బాధ్యత.!

- ఆర్డిటిని కాపాడుకుందాం.....!
- జేపీసీ పాదయాత్రకు రూ. 50వేల విరాళం ప్రకటించిన మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ
- మానవత్వం చాటుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మౌలానా





**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలో సుదీర్ఘకాలంగా పేద ప్రజల అభివృద్ధికి, సేవలకు కట్టుబడి ఉన్న ఆర్డీటీ సంస్థను కాపాడుకోవడం మనందరి బాధ్యతని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ తెలిపారు. పేదల అభ్యున్నతి, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి కోసం ఆర్డీటీ చేస్తున్న కృషిని గుర్తించాలన్నారు. ఆర్డిటి సంస్థ పారదర్శకమైన పనితీరును గౌరవిస్తూ అనంతపురం ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ సంఘాల జేపీసీ పాదయాత్రకు తన వంతు సాయంగా రూ. 50 వేల విరాళం ఇవ్వడం తన వంతు సామజిక బాధ్యత అని అన్నారు. ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యువల్ సమస్యలతో ఈ సంస్థ సేవలు నిలిచిపోయే ప్రమాదం ఉందని, ప్రజలందరూ ఐక్యంగా దీనిని రక్షించుకోవాలని కోరారు. ఆర్డీటీ ఏ మతానికో సంబంధం చింది కాదని, ఇక్కడ కులమతాలకు అతీతంగా అందరికీ సేవలు అందుతున్నాయని మనమంతా కలిసికట్టుగా ఆర్డిటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంత జిల్లాకి ఆర్డీటీ ఒక వరప్రదాయిని అని చెప్పారు. ఇలాంటి ఆర్డీటీని కాపాడు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీని కోసం రాజకీయాలకు అతీతంగా రాజకీయ పార్టీలు ముందుకు రావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ రెన్యువల్స్‌ను ఆపివేయడం అన్యాయ మన్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని పేదలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. ఆర్‌డిటి సేవలను కొనసాగించేందుకు ఉద్యమాలు చేస్తామని మౌలానా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు జాకీర్, మహబూబ్ బాషా, జై భీమ్ రామాంజి, ఆదినారాయణ, ప్రజా సంఘల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల భూ హక్కులకు రాజముద్ర భరోసా

- ఎమ్మెల్యే విజయ శ్రీ
- మల్లెపాలెంలో 94 మంది రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ




**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని డా. నెలవల విజయశ్రీ స్పష్టం చేశారు. సోమవారం దొరవారిసత్రం మండలంలోని మీజూరు సచివాలయం పరిధి మల్లెపాలెం గ్రామంలో 94 మంది రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదార్ పాస్ పుస్తకాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల భూమి హక్కులను శాశ్వతంగా రక్షించేందుకు అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు.

రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలు రైతులకు భద్రతతో పాటు చట్టబద్ధమైన హక్కులకు బలమైన ఆధారంగా నిలుస్తా యని పేర్కొన్నారు. నూతన పాస్ పుస్తకాలలో క్యూ ఆర్ కోడ్‌తో పాటు బ్లాక్‌చైన్ టెక్నాలజీని ఉపయోగించినట్లు వివరించారు. దీనివల్ల భూమి రికార్డులు ఎటువంటి మార్పులకు గురికాకుండా భద్రంగా ఉంటాయని, మోసాలకు తావు లేకుండా పారదర్శక వ్యవస్థ అమలు అవుతుందని తెలిపారు. 2026 జనవరి 2న ఈ కార్యక్రమాన్ని ఎన్. చంద్రబాబు నాయుడు ప్రారంభించారని గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు దశల వారీగా నూతన పట్టాదార్ పాస్ పుస్తకాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం అందించిన పాస్ పుస్తకాలపై మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫొటో ముద్రించడంతో వివాదాలు నెలకొన్నాయని ఆమె వ్యాఖ్యానించారు. రైతులకు ఉపయోగకరంగా, ప్రభుత్వ అధికారిక గుర్తింపుతో కూడిన పుస్తకాలను అందించడం ద్వారా భూ హక్కులకు శాశ్వత రక్షణ కల్పించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి దేవేందర్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసుల నాయుడు, సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోను జకరయ్య, మాజీ ఎంపిటిసి సభ్యుడు ఇట్టుగుంట రత్నయ్య, ఏఎంసీ డైరెక్టర్లు విజయ్ కుమార్, మల్లేపల్లి సుబ్రహ్మణ్యం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్రిగోల్డ్ బాధితుల రిలే నిరాహారదీక్షలు జయప్రదం చేయండి

- కదిరి నియోజకవర్గ అగ్రిగోల్డ్ బాధితుల అధ్యక్షులు హాజీ అత్తార్ మహబూబ్ బాషా
- అగ్రిగోల్డ్ బాధితుల దీక్షల కరపత్రాలు విడుదల - చలో విజయవాడ



**కదిరి - సూర్య వాస్తవం :** దాదాపు 11 సంవత్సరాల నుండి అగ్రిగోల్డ్ బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలు ఇంతవరకు పరిష్కారం కావడం లేదని ప్రభుత్వాలు మారినా బాధితులను పట్టించుకోవడం లేదని, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేటి నుండి 05-03-2026వ తేదీ వరకు విజయవాడ లో జరగనున్న రిలే నిరాహారదీక్షలకు ప్రతి



ఒక్క అగ్రిగోల్డ్ బాధితుడు తప్పక హాజరై జయప్రదం చేయాలని కదిరి నియోజకవర్గ అగ్రిగోల్డ్ బాధితుల అధ్యక్షులు హాజీ అత్తార్ మహబూబ్ బాషా పిలుపు నిచ్చారు. అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికై యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని, అగ్రిగోల్డ్ యాజమాన్యపు కుటుంబ సభ్యుల పేరిట, వారి బినామీల పేర ఉన్న వేల కోట్ల ఆస్తులను వెంటనే అటాచ్ మెంట్ చేసుకొని, ప్రభుత్వమే అమ్మి డిపాజిట్ దారులకు చెల్లింపులు చేయాలని, డబ్బులు కట్టిన కస్టమర్ల ఆర్థిక ఒత్తిడులతో ప్రతి రోజూ చచ్చి బ్రతుకుతున్న అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణం డిపాజిట్లు ఇప్పించాలని కోరుతూ విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలకు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అసోషియేషన్ కార్యదర్శి ఉత్తన్న, కోశాధికారి ఆనంద బాబు, సభ్యులు రమేష్, ఐ. శ్రీరాములు, సి.పి.ఐ. పట్టణ కార్యదర్శి లియాఖత్ అలి తదితరులు పాల్గొన్నారు.

# సిమెంట్ రోడ్లు వేయించిన టీడీపీ సీనియర్ నాయకులు



**తనకల్లు – సూర్య వాస్తవం:** శ్రీ సత్య సాయి జిల్లా తనకల్లు మండల పరిధిలోని కోటపల్లి పంచాయతీలోని గుట్ట మీద తండా,లో కదిరి నియోజకవర్గం శాసన సభ్యులు కందికుంట వెంటప్రసాద్ ఆదేశాల మేరకు మాజీ సింగల్ విండో అధ్యక్షుడు బాగేపల్లి చలపతి ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్ వేపించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ సింగల్ విండో అధ్యక్షుడు బాగేపల్లి చలపతి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో రోడ్లు వేసిన పాపన పోలేదు అని గత ప్రభుత్వ పని తీరు పై మండిపడ్డారు.మా ప్రభుత్వం అధికారములోకి వచ్చిన వెంటనే అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదే అని అన్నారు. అభివృద్ధి అంటే తెలుగుదేశం, తెలుగుదేశం అంటే అభివృద్ధి అని అన్నారు. మన ఎమ్మెల్యే నియోజకవర్గం అభివృద్ధికోసం అహర్నిశలు శ్రమిస్తూ, నిరంతరం పేదల సేవకు కృషి చేస్తున్నారు. ఇటువంటి మనసున్న ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గంలో మనం పుట్టడం ఎన్నో జన్మల పుణ్యమని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యే కు టీడీపీ నాయకులకు తాండప్రజలు ధన్యవాదాలు తెలియజేస్తూ, హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తండా ప్రజలు పాల్గొన్నారు.

# క్రైస్తవ సమాధులు మురికినీటిమయం
## - క్రైస్తవుల ఆవేదన





**పామిడి – సూర్య వాస్తవం:** పామిడిలోని కొత్త ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల క్రైస్తవుల సమాధులు మురికి నీటిమయం అయ్యాయి.పామిడిలో పులుసు కాలువ జంబుమయంతో ముందుకు కదలని మురుగు నీరు. పామిడి పట్టణంలోని కొత్త ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల క్రైస్తవ సమాధులు,మురుగునీటిమయమయ్యాయి. సమాధులకు ఆనుకొని పులుసు కాలువ వెళ్తుంది. గతంలో పైతట్టు ప్రాంతాల పొలాల వ్యర్థపు నీరు పులుసు కాలువ గుండా ప్రవహిస్తుంది. ఈ కాలువ బైపాస్ మీదుగా కొండూరు గ్రామానికి వెళ్లే పొలాల గుండా వెళ్లి పెన్నాలో కలిసేది కాలక్రమేనా ఈ కాలువ మురుగు కాలువగా మారింది. ఈ మురుగు కాలువ సైతం అక్రమనలకు గురైంది దీనికి తోడు కాలువ జంబుమయం అయింది.బైపాస్ మీదుగా వెళ్లే ఈ పులుసు కాలవను పునరుద్ధరించాలన్నారు. కాలువ వెంబడి గల అక్రమణాలను తొలగించి పూడికచేతతో మురుగునీరు ముందుకు ప్రవహించేలాసంబంధిత అధికారులు తక్షణం చెరలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత
## - విద్యార్థులకు పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ





**సింహాద్రిపురం – సూర్య వాస్తవం:** సింహాద్రిపురం మండలం జడ్పీ హైస్కూల్ హిమకుంట్లలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్రోత్సా హక కార్యక్రమం నిర్వహించబడింది. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మార్గదర్శ కత్వంలో భూమిరెడ్డి ఉమాదేవి, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి విద్యార్థులకు పెన్నులు , ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాబోయే వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.10వేల నగదు అందజేస్తామని ప్రకటించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# 10 రోజులుగా అరటి రైతుల బాధలు

## - అరటి తగ్గడానికి అనేక కారణాలు అంటున్న పరిశీలకులు



**పులివెందుల – సూర్య వాస్తవం:** గడచిన పది రోజులుగా అరటి పంటకు గిట్టుబాటు ధర పూర్తిస్థాయిలో పతనం కావడంతో రైతాంగం ఆవేదన చెందుతున్నారు. గత కొద్ది కాలంగా అరటిపంటకు పూర్తిస్థాయిలో మద్దతు ధర ఉండగా నేడు తగ్గుముఖం పడుతుండడంతో రైతులు ఆందోళన జరుగుతుండగా ప్రస్తుతం అరటిపంట ధర తగ్గడానికి గల కారణాలను ప్రముఖులు తెలియజేస్తూ హోలీ పండగ ఉండడం వల్ల నార్త్ సైడ్ మన అరటి వెళ్ళడానికి 6 డేస్ టైమ్ పడితే అవి మాగడానికి 2డేస్ టోటల్ 8 డేస్ అంటే 8 డేస్ రోజు అంటే హోలీ రోజు మాగితే అక్కడ ఎవరు బనానా కొనరు అని వ్యాపారస్థుల ఆలోచన ఒకటి కాగా, కరెక్ట్‌గా ఈ టైమ్‌లో ఇరాన్ – ఇజ్రాయిల్ యుద్ధం వల్ల ఎగుమతులు తగ్గడం, కటాన్ బాక్సులు ప్యాకింగ్ అనేది ఇరాన్, ఇరాక్, ఇజ్రాయిల్, కువైట్, కత్తర్ ఇలా ఇతర దేశాలకు వెళ్తూ ఉంటాయి కాబట్టి ఈ యుద్ధం వల్ల కూడా రైతులు నష్టపో తున్నా రన్నది మరో వాదన కాగా, డిల్లీ బండ్లు, టస్కర్ లు రిటర్న్ బాడుగలు లేని కారణంగా బండ్లకు 5వేలు నుండి 10వేలు బాడుగలు పెంచడంతో ఆ భారం కూడా రైతుల మీద పడడం మరో కారణంగా, రైతు వ్యాపారస్థుల దగ్గరకు వెళ్ళి 15 వేలుతో కాయలు కొట్టు అంటే సరే అన్న తరువాత, ఇంకో రైతు అదే వ్యాపారి దగ్గరకి వెళ్ళి నా కాయలు ఉన్నాయి 14 వేలుతో అమ్మకానికి అంగీకరించడం ద్వారా రైతుకి రైతు శత్రువుగా భావించవలసి వస్తోందని, హోలీ అయిపోయాక 10 రోజులకు నార్త్ సైడ్ నుండి ట్రాన్స్పోర్ట్ స్టార్ట్ అయ్యాక రిటన్ బడిగలు ఉన్నపుడు ప్రతి సరుకు అమ్ముడు పోయే అవకాశాలు కలవని కాబట్టి పెరిగే అవకాశాలు ఉంటాయి అని రైతులు అందరూ ఒక మాట మీద నిలబడి మనం ఏ రేట్ అయినా పర్లేదు అంటే అదే మాటను చనువుగా తీస్కొని వ్యాపారస్థులు ఎప్పటికీ త్వరలో నిర్ణయించి ఎప్పటికైనా వ్యాపారస్థులు రైతు తోటల వద్దకు వచ్చి వచ్చి ధర నిర్ణయిస్తేనే రైతుకి రైతు పంటకి విలువ ఉంటుందని అల కాకుండా రైతు వ్యాపారస్తుల రూమ్ దగ్గరకు వెళితే ఇక రైతుకి రైతు పంటకు విలువ ఉండదని భావించవలసి వస్తోందన్నారు.

ఏది ఏమైనప్పటికీ పది రోజుల తర్వాత రైతాంగ అంచనాల మేరకు ధరలు లభిస్తాయన్న ఆశాభావంతో రైతాంగ సోదరులు ఆశాజనకంగా ఉన్నారు.

# మహిళల సాధికారతే లక్ష్యం...

## - మహిళా డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా




**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పోలీసుశాఖ నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా... జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు సోమవారం నాడు అనంతపురం మహిళా పోలీస్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక చర్చ్ స్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్య క్రమాన్ని మహిళా విభాగం డీఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో చేపట్టారు. విద్యార్థుల్లో మహిళల పట్ల గౌరవ భావన, సమానత్వ దృక్పథం, చట్టపరమైన అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా ఈ పోటీలను చేపట్టారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు డీఎస్పీ బహుమతులు ప్రదానం చేశారు.

అనంతరం... డీఎస్పీ మాట్లాడారు."మహిళల భద్రత, గౌరవం ప్రతి కుటుంబం నుంచే ప్రారంభం కావాలి. చిన్న వయస్సు నుంచే బాలురలో, బాలికల్లో సమానత్వ భావన పెంపొందించాలి. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం. అలాంటి సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి. ఇప్పటి రోజుల్లో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. అపరిచితుల ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోకూడదు. సోషల్ మీడియా మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. సమస్యలు ఎదురైతే భయపడకుండా వెంటనే పోలీస్ శాఖను సంప్రదించాలి. మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా మహిళా హెల్ప్‌లైన్, శక్తి టీమ్స్ పనిచేస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. సమాజంలో మహిళలకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత. విద్యార్థులు రేపటి సమాజ నిర్మాణకర్తలు కాబట్టి, చిన్న వయసు నుంచే లింగ సమానత్వంపై అవగాహన పెంపొందించుకోవాలి" అని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సి.ఐ వెంకటేశ్వర్లు సిబ్బంది, శక్తి టీమ్స్, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# అంగన్వాడీ టీచర్లకు అండగా కూటమి ప్రభుత్వం

- నెలవల విజయశ్రీ
- రెండుసార్లు వేతనాల పెంపు
- మౌలిక వసతులు, వేసవి సెలవులపై కీలక నిర్ణయాలు



**నాయుడుపేట– సూర్య వాస్తవం:** రాష్ట్రవ్యాప్తంగా సేవలందిస్తున్న 58 వేల అంగన్వాడీ టీచర్లు, ఆయాల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తిరుపతి జిల్లా సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ స్పష్టం చేశారు. సోమవారం సూళ్లూరుపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను సరైన రీతిలో పరిష్కరించలేకపోయారని ఆమె విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న కష్టాలను ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా గమ నించారని తెలిపారు. వారి వేతనాల పెంపు, పని పరిస్థితుల మెరుగుదలపై అప్పుడే హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సాధారణ స్థితిలో లేకపోయినా, ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం వెనుకడుగు వేయదని ఆమె పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్వాడీ టీచర్లకు రెండుసార్లు వేతనాలు పెంచినట్లు వెల్లడించారు. ఇది ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. భవనాల మరమ్మతులు, తాగునీరు, విద్యుత్, శౌచాలయాల వంటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. వేసవి కాలంలో చిన్నారుల ఆరోగ్యం దృష్ట్యా అంగన్వాడీ సిబ్బందికి వేసవి సెలవులను మంజూరు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, సీడీపీవోలు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అంగన్వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని ఆమె కొనియాడారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ఆకు తోట రమేష్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, పార్టీ సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, పెరుమాళ్లు పలని, బొమ్మన ఏకాంబరం, రవి, కట్ట జనార్ధన్, పామూరు మునిస్వామి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, వారి సమస్యల పరిష్కారంలో చురుకైన చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే విజయశ్రీ స్పష్టం చేశారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )

# విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదవాలి





**వేంపల్లె – సూర్య వాస్తవం:** విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సీబీఐ మాజీ డైరెక్టర్ వివి.లక్ష్మి నారాయణ అన్నారు. నారాయణ విద్యాసంస్థల అధినేత కొట్టే నారాయణరెడ్డి ఆహ్వానం మేరకు ఆదివారం వేంపల్లి పట్టణంలోని గండి రోడ్డులో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, నిర్వాహకులు వివి లక్ష్మి నారాయణకు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే లక్ష్య నిర్ధారణ అత్యంత అవసరమని, చదువుపై పూర్తి దృష్టి సారిస్తూ రోజువారీ ప్రణాళికతో అధ్యయనం చేయాలని సూచించారు. కష్టపడి చదివితే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. పరీక్షల సమయంలో భయం, ఆందోళనలకు లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం నారాయణ విద్యాసంస్థల అధినేత కొట్టే నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సులోనే క్రమశిక్షణ, నైతిక విలువలు అలవర్చుకుంటే జీవితాంతం అవే మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ దశలో అత్యంత జాగ్రత్తగా చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. మంచి ఫలితాలే ఉన్నత చదువులకు, మెరుగైన అవకాశాలకు ద్వారమని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగడమే ప్రతి విద్యార్థి లక్ష్యంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు సుదర్శన్, రామ్మోహన్, మున్నా, యాస్మిన్, సంధ్యారాణి, మరియు ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు అన్నారు.

## చెక్కభజన కళాకారుడు బొప్పా ఈశ్వర్ గౌడ్‌కు

# లలిత కళాభిరామ పింఛము అవార్డు



**నంద్యాల – సూర్య వాస్తవం:** తెలంగాణ ప్రభుత్వం భాష సంస్కృతి శాఖ సౌజన్యంతో ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో లలిత కళాభిరామ పింఛన్ వారి ఆధ్వర్యంలో,21 వ వార్షిక పురస్కార్ రవీంద్ర భారతి లో లలిత కళాభిరామ అవార్డు ను చెక్క భజన గురువు బొప్పా ఈశ్వర్ గౌడ్ కు కళాభిరామ పింఛన్ అధ్యక్షులు గొల్లపల్లి జయన్న అందజేశారు,నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం, గుండంపాడు గ్రామానికి చెందిన బొప్పా వెంకటసుబ్బమ్మ, బాలనాగన్న దంపతులకు నలుగురు సంతానం అందులో మొదటి కుమారుడు బొప్పా ఈశ్వర గౌడ్ చిన్ననాటి నుండి చెక్కభజన పట్ల ఆసక్తి ఉండేది అది గమనించిన వారి తండ్రి బాలనాగన్నగా కుమారుని ఎలాగైనా చదువుతోపాటు చెక్కభజన కూడా నేర్పించాలని వారి ఊర్లో జరిగేటి తిరునాళ్లకు చెక్కభజన బృందం వచ్చేది ఆ కార్యక్రమాన్ని చిన్నవాడని ఈశ్వరుని తీసుకెళ్తూ స్వామివారి దర్శనం అనంతరం చెక్కభజనను తిలకించేవారు చెక్కభజన మీద ఇష్టంతో అతను మహాదేవపురం స్కూల్లో చదువుకుంటూ తండ్రికి వ్యవసాయంలో సహాయం చేసేవాడు తన పదవ తరగతి ఉన్నప్పుడు తను తండ్రి మరణించగా కుటుంబ భారం తనపై పడేది తల్లి తో పాటు వ్యవసాయం చేసుకుంటూ చదువుకుంటూ ఉండేవారు 2002 సంవత్సరము లో నాయన పల్లి గ్రామానికి చెక్క భజన గాన కోకిల మున్నెల్లి ఓబులేసు గాజులపల్లె ఆర్ఎస్ గ్రామంలో చెక్కభజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ చెక్కభజన కార్యక్రమం లో ఈశ్వర గౌడ్ పాల్గొని గురువు దగ్గర చేరి చెక్క భజన నేర్చుకున్నారు ఇలా సాగుతున్న అతను గురువుగా తన సొంత గ్రామం గుండంపాడు లో గురువుగా చెక్కభజన బృందం నేర్పించారు చెక్కభజనతోపాటు జడకోపు, కోలాటం, ఇలా అనేక గ్రామాలలో ప్రదర్శనలు ఇచ్చారు సుమారు 120 గ్రామాలలో 450 చెక్కభజన కార్యక్రమంలో నిర్వహించారు అతను మాట్లాడుతూ ఈ అవార్డు నాకు రావడం ఎంతగానో సంతోషంగా ఉందని నేను ఇంత స్థాయిలో ఉండటం ఈఅవార్డు పొందిన అంటే మా గురువు కి జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటానని తెలిపారు. లలిత కళాభిరామ అవార్డు అధ్యక్షులు గొల్లపల్లి జయన్న కి ప్రత్యేకమైనటువంటి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చెక్క భజన కళాకారులు గురువు బొజ్జయ్య, తిరుపతి జిల్లా చెక్కభజన గురువు వెంకటసుబ్బయ్య, జానపద కళాకారులు సాలయ్య , నాగేష్ , ప్రసాద్ గుండంపాడు గ్రామ పెద్దలు బంధుమిత్ర ప్రజలందరూ కూడా ఆనందం వ్యక్తం చేశారు

# మట్కా,జూదరులపై పోలీసుల ఉక్కుపాదం

**- జూదం ఆడుతున్న 18 మంది అరెస్ట్**

**- పులివెందులలో రూ.లక్షకు పైగా నగదు సీజ్**

**- చట్టవిరుద్ధ పనులకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు**

**- పులివెందుల డీఎస్పీ బి.మురళి నాయక్**




**పులివెందుల – సూర్య వాస్తవం:** కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేతన్ విశ్వనాథ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు పులివెందుల నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఆదివారం (మార్చి 1, 2026) పులివెందుల పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. పులి వెందుల డీఎస్పీ బుక్కే మురళి పర్యవేక్షణలో జరిగిన ఈ దాడుల్లో ఇన్ స్పెక్టర్లు వి.సీతారామిరెడ్డి (యు/జి పిఎస్)డి.హాజీవల్లి (ట్రాఫిక్ పి.ఎస్.),మరియు సబ్ ఇన్ స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. అరెస్టయిన వారులో 18 మంది ముద్దాయిలు వారి వద్ద నుండి స్వాధీనం చేసుకున్న నగదు రూ. 1,04,750 (లక్షా నాలుగు వేల ఏడు వందల యాభై రూపాయలు). రెండు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు జరిపి కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ బుక్కే మురళి మాట్లాడుతూ నియోజకవర్గంలో మట్కా,జూదం వంటి చట్టవిరుద్ధ పనులకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ఎక్కడైనా ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే ప్రజలు తన ఫోన్ నెంబర్ (9121100545)కు ఫిర్యాదు చేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని, తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## ఘనంగా రైల్వే లియాసన్ ఇన్‌స్పెక్టర్ మేడిశెట్టి శేషగిరి పదవీ విరమణ వేడుకలు

**విజయవాడ – సూర్య వాస్తవం:** రైల్వే ఎస్ఆర్ ముఠా కార్మికుల సమక్షంలో విజయవాడ తెలుగు ఫిలిమ్ ఛాంబర్ హాల్‌లో శ్రీ కృష్ణదేవరాయ బిరుదు అంకితుడైన రైల్వే లియాసన్ ఇన్‌స్పెక్టర్ మేడిశెట్టి శేషగిరి ఉద్యోగ పదవి విరమణ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మీయులు, సహఉద్యోగులు, రైల్వే అధికారులు, పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభినందనలు తెలుపుతూ శాలువ, పూలదండలతో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు మాట్లాడుతూ శేషగిరి 39 సంవత్సరాల రైల్వే ప్రస్థానంలో అంచలంచలుగా ఎదిగారని కొనియాడారు. ఆయన తీరు, క్రమశిక్షణ, నీతి, నిజాయితీ, నిబద్ధతతో పనిచేసి అధికారుల మన్ననలను పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు జిల్లా అధ్యక్షుడు కె పి వెంకటరమణ, కామిశెట్టి శ్రీనివాస్. తిరుమల శెట్టి నాగమలి ్లకార్జున, సంజయ్ అనుగోతు, హనుమారెడ్డి, షేక్ కాజవల్లి, దుర్గా ప్రసాద్, ఆకుల రాఘవేంద్రావు, వై నాగేంద్ర బాబు, దేగల శ్రీనువాసబాబు, రైల్వే ఉద్యోగ యూనియన్ నాయకులు రైల్వే సహ ఉద్యోగులు, కోగంటి సత్యం, పారిశ్రామిక వేత్త చెన్నూపాటి శ్రీను, మా ఆర్ట్స్ చంటి, ఆర్జా పాండురంగరావ్, రామినేని వెంకటేశ్వరరావు, రాయపురెడ్డి శ్రీనివాసరావు, నట్టం సుబ్బారావు, చందన సురేష్, నవనీతం సాంబశివరావు, శ్రీకృష్ణ దేవరాయ ఉద్యోగ జేఏసీ నాయకులు, సావిత్రి కళా పీఠం విజయలక్ష్మి , టిల్లు ఈవెంట్స్ నాయక్, రేణు ఉమామహేశ్వర్, ఏసోబు తదితరలు పాల్గొని మేడిశెట్టి శేషగిరికి పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.



## వివాహానికి ఆర్థిక సాయం అందించిన జిల్లా ఏడిసిసి బ్యాంక్ ఛైర్మన్



**సింగనమల – సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం సి.బండమీదపల్లి గ్రామంలో నివాస ముంటున్న కుంచపు అరుణ కూతురు శ్రీదివ్య వివాహానికి ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడిసిసి బ్యాంక్ ఛైర్మన్ రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం ఎంతో సంతోషకరం. వారి వైవాహిక జీవితం ఆనందంగా సుఖ సంతోషాలతో ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్డీటిని అందరం రక్షించుకుందాం

**- మార్చి 9న ఆర్‌డిటి మహాధర్నాని విజయవంతం చేద్దాం**

**- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి**



**ఉరవకొండ – సూర్య వాస్తవం:** వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఈనెల 9వ తేదీన ఉరవకొండ ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగ ఆర్డిటిని రక్షించాలని కోరుతూ పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నది. కావున ఉరవకొండ ప్రాంతంలో ఆర్డిటి సంస్థతో లబ్ధి పొందిన పేద, మధ్యతరగతి, దళిత, బహు జన కుటుంబాలు పెద్ద ఎత్తున జయ ప్రదం చేద్దాం అలా లేని పక్షంలో ఆర్డిటి సంస్థ ఈ ప్రాంతం నుంచి తరలిపోతే విద్య, వైద్యం, సేద్యం పేదలకు దూరమై పోవడాన్ని ఊహించుకుంటేనే భయమేస్తుంది. ఆర్డిటిని రక్షించుకోకపోతే మన ప్రాంతం చాలా నష్టపోవడంతో పాటు వలసలు పెరిగిపోయి పేదల బతుకులకు గ్యారెంటీ లేకుండా పోతుంది. విద్య, వైద్య సేవలు నిలిచిపోయి, అన్ని రకాలుగా తీవ్ర నష్టం జరుగుతుంది. అందుకే ఈ సమస్యపై రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని దళిత, గిరిజన, బహుజన, బీసీ, అభ్యుదయ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా పిలుపునిచ్చారు.


## ఉద్యోగ - విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



**పులివెందుల – సూర్య వాస్తవం:** ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక మరియు విశ్రాంత ఉద్యోగుల కార్యాచరణ సమితి పేర్కొంది. పులివెందులలోని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్‌లో ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక, విశ్రాంత ఉద్యోగుల సంయుక్త కార్యచరణ సమితి జేఏసీ నూతనంగా ఏర్పడి ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అవలంబించవలసిన విధి విధానాలను సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో గజ్జల జగన్నాథరెడ్డి( ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షులు పులివెందుల), కో–ఛైర్మన్ – డివి కొండారెడ్డి, కో ఛైర్మన్ –జి మల్లేష్, (ఎస్‌టియు ), కో– ఛైర్మన్– ఏ శ్రీనివాసులు( గ్రామ వార్డు సచివాలయం), కో– ఛైర్మన్– ఏ రాజేంద్ర( పంచాయతీ రాజ్), కన్వీనర్ –శ్రీ బి అమర్నాథరెడ్డి (పిఆర్టియు), ఆర్గనైజేషన్ సెక్రటరీ శివ శంకర రావు (ఏపీ ఏవో ఆఫీస్ పులివెందుల), కో–కన్వీనర్ –సిఎం శ్రీకాంత్ రెడ్డి( పియుటియు ), కో కన్వీనర్– శ్రీ రామాంజనేయులు (రెవెన్యూ), కో కన్వీనర్ – పి.గంగయ్య (జిఎస్డబ్ల్యూఎస్), కో– కన్వీనర్– వైజే సుగుణాకర్, ట్రెజరర్– డాక్టర్ వై రామ గంగాధర రెడ్డి యాదవ్ (ఏపీఎన్జీవో ట్రెజరర్), కార్యవర్గ సభ్యులు – ఎస్ నాగ సుబ్బరాయుడు( రెవెన్యూ) కార్యవర్గ సభ్యులు –డి సుధీర్ కుమార్ రెడ్డి( జి ఎస్ డబ్ల్యూ ఎస్.), కార్యవర్గ సభ్యులు– జి సురేంద్రనాథ్ (ఆర్ఐ ), కార్యవర్గ సభ్యులు– ఎస్ సోమశేఖర్ (జి ఎస్ డబ్ల్యూ ఎస్), కార్యవర్గ సభ్యులు – కె శరణాత్ (జి ఎస్ డబ్ల్యు ఎస్) తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ జయప్రదం చేయండి

**- పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి జోష్ణ దేవి**



**పత్తికొండ – సూర్య వాస్తవం :** పత్తికొండ పట్టణంలో ఈనెల 14వ తేదీ నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి జోష్ణ దేవి అన్నారు. సోమవారం పత్తికొండ కోర్టు పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పోలీసు అధికారులతో లోకదాలపై ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాజు కాబడే పరిష్కార దశలో ఉండే కేసులను ఈ లోకదాలతో ఎక్కువగా పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవనకొండ, తుగ్గలి, మద్దికేర పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.